


ఉపాధి కింద పండ్ల తోటలు : కలెక్టర్

కర్నూలు అగ్రికల్చర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కర్నూలు మండలంలోని రుద్రవరం గ్రామంలో కాశీం అనే రైతు పొలంలో కలెక్టర్, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి మామిడి మొక్కలను నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 6వేల ఎకరాల విస్తీర్ణంలో పండ్ల తోటల పెంపకాన్ని ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఏపీడీ పద్మావతి పాల్గొన్నారు.

పోరాటం ఆగదు

- లేబర్ కోడ్స్ రద్దు చేయాల్సిందే
- కార్మికులను కట్టుబానిసలు కానివ్వం
- కార్మిక సంఘాల నాయకుల హెచ్చరిక
- ముగిసిన సార్వత్రిక సమ్మె



జిల్లా పరిషత్ నుంచి ర్యాలీగా వస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు కార్మిక వర్గం పోరాడుతూనే ఉంటుందని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ నగర కార్యదర్శులు జి. చంద్రశేఖర్, విజయ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ నుంచి రాజవిహార్, మెడికల్ కాలేజీ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన సభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజి బాబు మాట్లాడుతూ బీజేపీ తీసుకువచ్చిన చట్టాలతో కార్మికులను కట్టుబానిసలు కానివ్వమన్నారు. ఇప్పటికే దేశ సంపదలో 40 శాతం బడా పెట్టుబడిదారుల స్వాధీనం చేసుకున్నారని విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప మాట్లాడుతూ లేబర్ కోడ్స్ కార్మికులకు తీవ్రమైన నష్టాన్ని కలుగజేస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడ పని గంటల పెంచి, రాత్రి పూట మహిళలతో పని చేయించాలని నిర్ణయం తీసుకోవడం అన్యాయమని అన్నారు. అనంతరం శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి. నిర్మల మాట్లాడుతూ స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జే. లలిత, ఏఐబీఈఏ రాష్ట్ర నాయకుడు నాగరాజు, జనరల్ ఇన్సూరెన్సు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రఘుబాబు, ఏపీజీబీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు హనుమంతరెడ్డి, ఎల్ఐసీ యూనియన్ కార్యదర్శి సునియాకుమార్, బీఎస్ఎన్ఎల్ నాయకుడు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వ్యాఖ్యలు సరికాదు

వైసీపీ నేతలపై సోమిశెట్టి ఆగ్రహం



కర్నూలు అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు మహిళలను టార్గెట్ చేసి కించపరుస్తూ మాట్లాడటం సరికాదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు విమర్శించారు. బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కొవ్వూరు టీడీపీ మహిళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి అనుచితంగా వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రతి కుటుంబంలో మహిళలు ఉంటారనే విషయాన్ని వైసీపీ నాయకులు దృష్టిలో పెట్టుకోవాలని అన్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు తగిన శాస్త్రి చేసినా ఇంకా మారలేదని అన్నారు.



కోసిగి మండలం సాతనూరు వద్ద ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద అసంపూర్తిగా ఆగిపోయిన ఆర్డీఎస్ కుడి కాలువ స్లూయిస్ పనులు (ఫైల్)

6 ప్రాజెక్టులకు ఓకే...!

- వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ పనులకు మోక్షం
- రాయలసీమ లిఫ్ట్ కూడా
- 25 శాతంలోపు పనులైన ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం
- వాటి విలువ రూ.6,581.96 కోట్లు



పశ్చిమ ప్రాంత కరువు నివారణకు రాష్ట్ర విభజన తరువాత అప్పటి చంద్రబాబు ప్రభుత్వం వేదవతి ఎత్తిపోతల పథకం, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టులను ప్రారంభించింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాజెక్టుల పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా 25 శాతంలోపు పురోగతి ఉన్న పనులు ఆపేసింది. ఎట్టకేలకు బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం.. టెండర్లు పూర్తై మొదలు పెట్టని, 25 శాతంలోపు పురోగతి ఉన్న పనులు కూడా కొనసాగించాలని నిర్ణయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, రాయలసీమ లిఫ్ట్ సహా రూ.6,581.96 కోట్లు విలువైన ఆరు ప్రాజెక్టులకు మోక్షం లభించింది. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కర్నూలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు అందించాలనే లక్ష్యంగా వేదవతి ఎత్తిపోత పథకం ప్రాజెక్టు చేపట్టారు. ఈ ప్రాజెక్టును సాగునీటి నిపుణుడు, రిటైర్డ్ ఈఈ సుబ్బరాయుడు డిజైన్ చేశారు. 2019 జనవరి 29న రూ.1,942.80 కోట్లు మంజూరు చేస్తూ జీవో. ఆర్‌టీ.నెం.77 జారీ చేసింది. ఫిబ్రవరిలో టెండర్లు కూడా పూర్తి చేసింది. హైదరాబాద్‌కు చెందిన మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థ 4.69 శాతం అధిక (ఎక్సెస్) రేట్లకు దక్కించుకొని పనులు మొదలు పెట్టారు. రూ.106.2 కోట్లు (6.61 శాతం) పనులు చేశారు. తక్షణం పనులు మొదలు పెట్టాలంటే రూ.395 కోట్లు అవసరం ఉంది. భూసేకరణకు చేసిన ఖర్చు రూ.78 లక్షలు మాత్రమే. అయితే.. 2019 మేలో జగన్ సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. బిల్లులు రావని కాంట్రాక్ట్ సంస్థ పనులు ఆపేసింది. స్టేజ్-1లో పైపులైన్ పనులు, హంద్రీ నీవా కాలువపై స్టేజ్-2 పంప్‌హౌస్ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. భూసేకరణ, హాలహర్వి, మొలగవెల్లి జలాశయాలు పనులు, ప్రధాన పైపులైన్ పనులు మొదలే కాలేదు. 2019 జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చాక వీటికి మోక్షం వస్తుందని ఆశిస్తే.. 25 శాతంలోపు పురోగతి ఉన్న పనులు ఆపేయమని ఇచ్చిన జీవో శాపంగా మారింది. తాజాగా మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం ఊపిరి పోసింది.



హంద్రీనీవా కాలువ వద్ద అసంపూర్తిగా వేదవతి ప్రాజెక్టు స్టేజ్-2 పంప్‌హౌస్ పనులు (ఫైల్)

ఆర్డీఎస్ రైతుల్లో హర్షం

మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ఆశయంగా ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-2 ఈ ప్రాజెక్టుకు 4 టీఎంసీలు తుంగభద్ర జలాలు కేటాయించింది. కోసిగి మండలం సాతనూరు సమీపంలో ఉన్న ఆర్డీఎస్ ఆనకట్ట నుంచి నీటిని తీసుకోవాలి. దశాబ్దాలుగా కరువు, వలసలతో తల్లడిల్లే పశ్చిమ ప్రాంత పల్లెసీమలకు జీవనాడి అయిన ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం గత చంద్రబాబు ప్రభుత్వం రూ.1,985.42 కోట్లు మంజూరు చేస్తూ 2019 జనవరి 20న జీవో ఆర్‌టీ నెం.76 జారీ చేసింది. మార్చి 7న టెండర్లు ప్రక్రియ పూర్తి చేశారు. 4.75 శాతం అధిక రేట్లకు టెండర్లు తక్కించుకున్న హైదరాబాదుకు చెందిన ఎన్‌సీసీ లిమిటెడ్ సంస్థతో కాంట్రాక్ట్ విలువ రూ.1,631.34 కోట్లకు ప్రభుత్వంతో ఒప్పందం కూడా చేసుకున్నారు. పనులు మొదలైయ్యే దశలో ప్రభుత్వం మారిపోయింది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద హెడ్ స్లూయిస్ పనులు మొదలు పెట్టారు. హెడ్ వర్క్ పనులు, కాలువ నిర్మాణం రూ.11.90 కోట్లు విలువ పనులు (0.73 శాతం) మాత్రమే చేశారు. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఐదేళ్లు గంపెడు మట్టి కూడా తీయలేదు. తాజాగా ఈ ప్రాజెక్టు పనులు కొసాగించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలపడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాయలసీమ లిఫ్ట్‌కు ఓకే




వేదవతి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా తెచ్చిన పైపులు

రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్ (ఆర్‌డీఎంపీ)లో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం చేపట్టింది. శ్రీశైలం ఫోర్‌షోర్ ఏరియా సంగమేశ్వరం నుంచి రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాలువ (ఎస్ఆర్ఎంసీ)లో వేయాలి. ఈ పనులకు రూ.2020 మే 5న అప్పటి ప్రభుత్వం రూ.3,825 కోట్లు మంజూరు చేస్తూ జీవో ఆర్టీ నంబరు 203 జారీ చేసింది. ఎస్‌పీఎంఎల్-ఎన్‌సీసీ-మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) జాయింట్ వెంచర్‌గా పనులు దక్కించుకొని రూ.3,307.06 కోట్లతో పనులు చేసేందుకు 2021 ఫిబ్రవరి 27న ఒప్పందం చేసుకున్నారు. దాదాపు రూ.745.46 కోట్ల (22.54 శాతం) విలువ చేసే పనులు చేశారు. గత ఎన్నికల ముందు ఈ పనులకు సంబంధించిన బిల్లులు చెల్లింపులపై పెద్ద ఎత్తున రాజకీయ దుమారం రేగింది.

మిగతా 6వ పేజీలో

డీసీసీలో అధ్యక్ష గోల..!

- కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు
- నేతల మధ్య కుదరని సయోధ్య
- తాజాగా జిల్లా ఇన్‌చార్జి నియామకం
- నూతన కమిటీ కూర్పుపై సమాలోచనలు



కర్నూలు అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన పార్టీ అది. కర్నూలు జిల్లా నుంచి రాష్ట్రపతులు, ముఖ్యమంత్రులను అందించిన కాంగ్రెస్ పార్టీ నేడు అంతర్గత కుమ్ములాటలు, నేతల నడుమ వైషమ్యాలతో రచ్చకెక్కింది. జిల్లా అధ్యక్ష పదవి కోసం పోటీ తీవ్రంగానే ఉన్నప్పటికీ సరైన వ్యక్తికి జిల్లా పార్టీ పగ్గాలు అప్పజెప్పేందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆచితూచి అడుగులేస్తోంది. మొత్తం మీద డీసీసీ పీఠం కోసం కుస్తీ పోరు తారస్థాయికి చేరుకుంది. జిల్లా కాంగ్రెస్ పార్టీని నడిపించే సారథిలేక గత ఐదేళ్ల కాలంలో అధిష్టానం ప్రయోగాలు చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం డీసీసీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణను పార్టీ ఎంపిక చేసింది. అయితే ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పేరుతో సొసైటీ ఏర్పాటు చేయడం, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలతో ఆయన్ను పార్టీ హైకమాండ్ తొలగించిన విషయం తెలిసిందే. అప్పటినుంచి జిల్లా సారథి లేకుండానే పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో నగర అధ్యక్షుడిని నియమించినప్పటికి పార్టీలో ఎవరికి వారు వర్గాలుగా విడిపోయి చోటా మోటా నాయకులు సైతం డీసీసీ పీఠం కోసం గాంధీ భవన్‌లో పైరవీలు చేస్తున్నారు. పార్టీలో జరుగుతున్న అంతర్గత పోరు వర్గాలుగా చీలిపోయి పార్టీ పరువుతీస్తున్నారని పలువురు నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమైక్యాంధ్ర ఉద్యమం తర్వాత పార్టీ ఒక్కసారిగా కనుమరుగైన విషయం తెలిసిందే. అయినా కూడా కొంత కాలం కీలక నాయకులు పార్టీని నడిపించారు. వైసీపీ పాలనలో కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న కీలక నాయకులెందరో వైసీపీలోకి వెళ్లిన విషయం తెలిసిందే. ఆ క్రమంలో పార్టీని నడిపించే సారధి లేకపోయినప్పటికి పార్టీ మనుగడ సాగిస్తూ ఉనికిని చాటుతోంది. ప్రముఖుల వర్ధంతులు, జయంతులతో పాటు, రాష్ట్ర, జాతీయ నిరసనలు, ఆందోళనలు కొనసాగున్నాయి.

రూ.20 లక్షల కోసం ఆరాటం..!

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆస్తుల ద్వారా ఏడికి సుమారు రూ.20 లక్షల దాకా ఆదాయం సమకూరుతోంది. దానిపై పెత్తనం చెలాయించేందుకు ఎందరో ఇప్పటికే కుస్తీలు పడుతున్నారు. ఇప్పటి వరకు ఏళ్ల తరబడి పాలించిన నాయకులు పార్టీ ఖజానాలో ఒక్క పైసా కూడా లేకుండా చేశారు. ఈ క్రమంలో ప్రతి నెలా వచ్చే ఆదాయాన్ని పీసీసీ అకౌంట్లో జమచేయాలని అధిష్టానం ఆదేశించింది. డబ్బును పీసీసీ అకౌంట్‌కు జమ చేయడాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా నాయకులు తీర్మానాన్ని చేసి పంపారు. పైగా పార్టీకి చెందిన ఆస్తులను కబ్జా చేసేందుకు, దుర్వినియోగం చేసేందుకు కొందరు నాయకులు కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీలోని కొందరు నేతలు చెబుతున్నారు.



మిగతా 6వ పేజీలో



పెద్ద పండుగ

- నేడు మెగా పీటీఎం 2.0
- ప్రతి పాఠశాలలో సంబరాలకు సర్వం సిద్ధం
- ప్రభుత్వ స్కూళ్ల బలోపేతం దిశగా ప్రభుత్వం



కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో భాగస్వామ్యం ఉన్నప్పుడు ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుందన్న నమ్మకంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. చేసిన మంచిని ప్రజలకు చెబుతూ.. చేయబోయే అభివృద్ధిని వివరిస్తూ ప్రజాపాలనను కొనసాగిస్తోంది. ఇదే క్రమంలో విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని గురువారం రాష్ట్ర వ్యాప్తంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 2.0 నిర్వహణకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 1,406 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్స్ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం రూ.3.30 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. తల్లిదండ్రులు తమ పిల్లలు విద్యాపరంగా, ప్రవర్తన పరంగా ఏ స్థాయిలో ఉన్నారో, సమాజ అంశాలపై ఎలాంటి అవగాహన కలిగి ఉన్నారో తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. విద్యార్థుల ప్రయోజనాల కోసం ఉపాధ్యాయుల నుంచి ఎలాంటి సహకారం కోరుకుంటున్నారో పరస్పరం తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం మంచి వేదిక అని ప్రభుత్వం భావించింది.

మిగతా 6వ పేజీలో

నేడు రెండో విడత 'తల్లికి వందనం'

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లోని సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకం రెండో విడత నిధులు గురువారం జమ కానున్నాయి. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హులైన వారి జాబితాను సిద్ధం చేశారు. 2025-26 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు 18వేల మంది, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందిన 21వేల మంది విద్యార్థులు తల్లికి వందనం పథకం కింద లబ్ది పొందనున్నారు. అలాగే మొదటి విడతలో వివిధ కారణాలతో నిధులు జమకాని వారికి కూడా రెండో విడతలో తల్లుల ఖాతాల్లో నిధులు జమ అవుతాయని అధికారులు తెలిపారు.

నేడు గురు పౌర్ణమి



కర్నూలు కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురువును త్రిమూర్తుల స్వరూపంగా భావిస్తూ నిర్వహించుకునే వేడుక 'గురు పౌర్ణమి'ని గురువారం జిల్లా వాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. ఈ ఏడాది గురు పౌర్ణమి గురువారం రోజునే రావడం ప్రత్యేక విశేషంగా భక్తులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని షిరిడీ సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గురు పౌర్ణమిని వ్యాస పౌర్ణమిగానూ పేర్కొంటారు. ఇదే రోజున వేదవ్యాస మహర్షి జన్మతిథి కావడంతో, వేదాలు లోకానికి అందించిన వ్యాస భగవానుడిని ఈ వేడుకలో ప్రత్యేకంగా పూజిస్తారు. ఈ నేపథ్యంలో షిరిడీ సాయిబాబా దేవాలయాల్లో, దత్తాత్రేయ మందిరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని షిరిడీ సాయిబాబా దేవాలయాల్లో, దత్తాత్రేయ మందిరాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కర్నూలు నగరంలోని ప్రముఖ ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సంక్షేమం ఎరుగని మత్స్య కార్మికులు

- నేడు ఒక్కో పథకం అమలులోకి..
- నేడు జాతీయ మత్స్యకారుల దినోత్సవం

నకిలీ వ్యక్తులతో రిజిస్టర్

- మృతుల పేరుతో అక్రమం
- చేతులు మారిన రూ.18లక్షలు
- ఐదుగురి అరెస్టు

7





పారదర్శకంగా పోషకాహారం

● అంగన్‌వాడీల్లో ముఖ ఆధార్ గుర్తింపు
● పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా చర్యలు

చాగలమర్రి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేసే పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా పారదర్శకతకు పెద్దపీట వేసేలా కేంద్ర, మహిళ శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ముఖ ఆధారిత గుర్తింపును ఆచరణలోకి తీసుకుంది. లబ్ధిదారులకు సరుకులు, ఆహార పంపిణీ సమయంలో ముఖ గుర్తింపు తప్పనిసరి కానుంది. పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేసినా కొన్ని నెలలుగా నిలిపి వేసింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేసింది. అంగన్‌వాడీల్లో నమోదు చేయగానే నేరుగా కేంద్రానికి చేరుతుంది. ప్రతి నెల రెండుసార్లు బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం అందిస్తారు. ప్రతి 15 రోజులకు ఒకసారి అంగన్‌వాడీ కేంద్రాల వద్ద హెల్త్ న్యూట్రీషన్ డేను నిర్వహించి వైద్యులు వచ్చి పరీక్షలు చేస్తారు.

బాల సంజీవని యాప్‌లో నమోదు

ప్రస్తుతం బాలసంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలు, 7-3 ఏళ్ల లోపు చిన్నారుల ముఖ గుర్తింపును నమోదు చేస్తోంది. కేంద్ర పర్యవేక్షణలోని పోషణ్ ట్రాకర్ యాప్‌లోను దాన్ని నమోదు చేయనున్నారు. యాప్‌లో ఫొటోతో సహా నమోదవుతుండటంతో క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం పంపిణీ ఏ మేరకు జరుగుతుందో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి నుంచి పర్యవేక్షించడం సులభమవుతుంది. కొన్ని కేంద్రాల్లో ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఈ నమోదును ప్రారం భించారు. మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం వడ్డించే సమయంలో ఫొటో తీసి ఆ వివరా లను పోషణ్ ట్రాకర్‌లో నమోదు చేయనున్నారు. అంగన్ వాడీలలో గర్భిణీలు, బాలింతలకు ముఖ ఆధారిత గుర్తింపు ఉంటేనే పౌష్టికాహారం అందుతుంది. పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ప్రత్యేక చర్యలు ప్రభుత్వం తీసుకుంటోంది.



గర్భిణులకు అందించే పౌష్టికాహారం

3 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, 500 ఎంఎల్ ఆయిల్, 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు, కేజీ అటుకులు, 2 కేజీల రాగిపిండి, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాములు పల్లి చెక్కిలు, 250 గ్రాములు ఎండు ఖర్జూరం అందిస్తారు. నెలకు రెండుసార్లు ఈ విధంగా పంపిణీ చేస్తారు. 6 నెలల బిడ్డ నుంచి 3 ఏళ్ల బిడ్డ వరకు 25 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు, 25 కేజీల బాలామృతం ఇస్తారు.

జిల్లా పరిధిలో ఇలా..

జిల్లాలోని 29 మండలాల పరిధిలో 8 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా 1620 అంగన్‌వాడీ కేంద్రాలు, 43 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 0-6 నెలలు లోపు 16,548 మంది చిన్నారులు, 7 నెలలు నుంచి ఏడాది లోపు 14,698 మంది, సంవత్సరం నుంచి మూడేళ్ల లోపు 50,137 మంది, 3 నుంచి 6 ఏళ్ల లోపు 39,462 మంది చిన్నారులు, 14,319 మంది గర్భిణీలు, 13,077 మంది బాలింతలు ఉన్నారు. ఆళ్లగడ్డ ప్రాజెక్టు పరిధిలో 309 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు.



పోషణ్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుశీల

100 శాతం అందించేలా చర్యలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ గుర్తింపు ద్వార పోషకాహారం అందిస్తున్నాం. ప్రభుత్వం చేపట్టిన ఈ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయనున్నారు. 100 శాతం లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం. అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ గుర్తింపుతో పాటు ఈకేవైసీ చేయిస్తున్నాం. ఆళ్లగడ్డ ప్రాజెక్టు పరిధిలోని 306 అంగన్‌వాడీ కేంద్రాల్లో పక్కాగా ముఖ ఆధారిత గుర్తింపు ప్రక్రియను అమలు చేస్తాం.



తేజశ్వరి, సీడీపీవో, ఆళ్లగడ్డ

ఆరు ప్రాజెక్టులకు ఓకే .!

(5వ పేజీ తరువాయి)


కూటమి ప్రభుత్వం వచ్చాక పురోగతి 25 శాతం కంటే తక్కువ ఉండడంతో పనులు ఆపేశారు. తాజాగా ఈ పనులు కూడా కొనసాగించేందుకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం ఆమోదం తెలపడంతో రాయలసీమ లిఫ్టుకు అడ్డంకులు తొలగిపోయినట్లే అని సీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు.

మంత్రివర్గం ఆమోదించిన ఇతర ప్రాజెక్టులు

● గోరకల్లు రిజర్వాయర్ (జీబీఆర్) వద్ద 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 3 వెంట్లతో అడిషనల్ ఇన్‌ఫాల్ రెగ్యులేటర్, అప్రోచ్ ఛానల్, లీడింగ్ ఛానల్ పనులకు రూ.36.95 కోట్లు మంజూరు చేస్తూ 2020 మే 5న అప్పటి ప్రభుత్వం జీవో ఆర్టీ నెంబరు.203 జారీ చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఆర్ ఎడిఫీసే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.28.75 కోట్లకు పనులు చేసేందుకు 2021 డిసెంబరు 29న ఒప్పందం చేసుకుంది. అయితే.. పనులు మొదలు కాలేదు.

● శ్రీశైలం ప్రాజెక్టు 12 క్రస్ట్‌గేట్లు ప్రత్యేక మరమ్మతులు, గేట్ల రబ్బర్ సీల్స్ మార్చడం, దెబ్బతిన్న హాయిస్ట్ ప్లాట్ ఫారం చెకర్డ్ ప్లేట్స్ మార్చడం, దెబ్బతిన్న గాంట్రీ-క్రేన్ కేబుల్, క్యాబిన్స్ మార్చడం వంటి పనులకు రూ.1.59 కోట్లు మంజూరు చూస్తూ 2024 ఫిబ్రవరి 6న జీవో ఆర్టీ నంబరు.64 జారీ చేశారు. రూ.1.40 కోట్లకు పనులు చేసుందుకు కర్నూలుకు చెందిన ఎస్‌వీ ఇంజనీరింగ్ సంస్థ గతేడాది సెప్టంబరు 20న ఒప్పందం చేసుకుంది. రూ.8 లక్షలు (5.71 శాతం) పనులు మాత్రమే చేశారు.

● శ్రీశైలం డ్యాం సైట్‌లో 2,000 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫారం కాలిపోయింది. దాని స్థానంలో 1,000 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఏర్పాటుకు రూ.కోటి మంజూరు చేస్తూ గతేడాది ఫిబ్రవరి 2న జీవో ఆర్టీ నంబరు.63 జారీ చేశారు. రూ.88 లక్షలకే ట్రాన్స్‌ఫారం ఏర్పాటుకు హైదరాబాద్‌కు చెందిన ఆర్. పాండురంగం అండ్ సన్స్ సంస్థ ఒప్పందం చేసుకుంది. రూ.5 లక్షలు (5.68 శాతం) పనులు మాత్రమే చేశారు.



శ్రీశైలం ప్రాజెక్టు

● నంద్యాలలో కేసీ కెనాల్ సముదాయంలో తెలుగుగంగ సర్కిల్, ఎస్ఆర్‌బీసీ సర్కిల్ కార్యాలయ భవనాలు నిర్మాణాలకు రూ.5.25 కోట్లు మంజూరు చేస్తూ 2020 మే 5న అప్పటి ప్రభుత్వం జీవో ఆర్టీ నంబరు.203 జారీ చేసింది. ఈ పనులు రూ.4.88 కోట్లతో చేసేందుకు నంద్యాలకు చెందిన కానాల గోపాల్ రెడ్డి అనే కాంట్రాక్టర్ ఒప్పందం చేసుకొని రూ.30 లక్షలు (6.25 శాతం) పనులు మాత్రమే చేశారు.

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో జలవనరులు శాఖ పరిధిలో ఆగిపోయిన రూ.6,581.96 కోట్ల విలువైన వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, రాయలసీమ లిఫ్ట్ సహా ఏడు పనులు కొనసాగించేందుకు సీఎం చంద్రబాబు అధ్యక్షత జరిగిన మంత్రివర్గం సమావేశంలో నిర్ణయం తీసుకోవడంపై రైతులు, సాగునీటి నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ ఎంపీ సంజీవకుమార్‌కు గోల్డ్ మెడల్

కర్నూలు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చేసిన సేవలకు గుర్తింపుగా కర్నూలు మాజీ ఎంపీ డాక్టర్ సంజీవకుమార్‌కు గోల్డ్‌మెడల్ దక్కింది. 17వ లోక్‌సభలో 2019 నుంచి 2024 వరకు సంజీవకుమార్ ఎంపీగా ఉన్నారు. ఆ సమయంలో రెడ్ క్రాస్ సొసైటీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. నాడు కృషికి గుర్తింపుగా రెడ్‌క్రాస్ సొసైటీ గోల్డ్‌మెడల్ అందజేసింది. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఈ సత్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సంజీవకుమార్ మాట్లాడుతూ ఎంపీగా ఉన్న సమయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించానన్నారు. అందులో భాగంగా రెడ్ క్రాస్ సొసైటీల అభివృద్ధి కోసం తన వంతు బాధ్యతగా కృషి చేశానని తెలిపారు. పదవిలో ఉన్నా లేకపోయినా సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఉంటానని చెప్పారు.



గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న మాజీ ఎంపీ సంజీవకుమార్

నేడు 'శ్రీ షిరిడీ సాయిలీలలు' నాటకం

కర్నూలు కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సౌజన్యంతో, కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో 'శ్రీ షిరిడీ సాయిలీలలు' నాటకం ప్రదర్శిస్తున్నట్లు నంది అవార్డు గ్రహీత గుర్రపుశాల అంకయ్య తెలిపారు. గురువారం సాయంత్రం 6:30 గంటలకు ఈ నాటకం ప్రారంభమవుతుందన్నారు. విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి నాటకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ నాటకంలో సాయిబాబాగా గుర్రపుశాల అంకయ్య, పి.షేక్షావలి, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, క్రిష్ణయ్య, రామకృష్ణ, శ్రీనివాసులు, గోవిందరాజులు, శారద, ఆర్.రాధిక నటిస్తున్నట్లు వివరించారు. మార్తాటి గోపాలరావు రాసిన ఈ నాటకానికి టీవీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారని తెలిపారు. నాటకాభిమానులు, సాయి భక్తులు ఈ నాటకం తిలకించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్లాట్ల వివాదాన్ని పరిష్కరించిన శాశ్వత లోక్ అదాలత్



శాశ్వత లోక్ అదాలత్ సమక్షంలో రాజీ అవుతున్న బాధితులు

కర్నూలు లీగల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ప్లాట్ల వివాదాన్ని కర్నూలు శాశ్వత లోక్ అదా లత్ సత్వరంగా పరిష్కరించినట్లు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం. వెంకట హరినాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదోని మండలంలో శ్రీలక్ష్మమ్మ అవ్వ ఎంటర్ ప్రైజెస్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ బెనిఫిట్స్ స్కీం కింద పలువురు వ్యక్తుల నుంచి కంతులను స్వీకరించింది. డ్రిప్‌ల ద్వారా లబ్ధి పొందిన వ్యక్తులకు, కంతుల కాలం పూర్తయిన తర్వాత కూడా సంస్థ నిర్వాహకులు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయలేదు. డ్రిప్‌ల ద్వారా వచ్చిన బహుమతులను కూడా ఇవ్వలేదు. దీంతో బాధితులంతా కలిసి తమ న్యాయవాది షేక్ షఫీ, మస్తాన్ వలీ ద్వారా లోక్ అదాలత్‌ను ఆశ్రయించారు. దీంతో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు సంస్థ నిర్వాహకులకు నోటీసులను జారీ చేశారు. దీంతో బుధవారం రూ.25,35,000 విలువగల ఈ కేసులను ఎటువంటి ఖర్చు లేకుండా పరిష్కరించి బాధితులకు న్యాయం చేసినట్లు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం. వెంకట హరినాథ్ తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

● వినూత్న నిరసనలతో కార్మికుల సమ్మె

ఎమ్మిగనూరుటౌన్/రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణ మే రద్దు చేయాలని ఆయా కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త సమ్మె విజయవంతమైంది. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఆశా, అంగన్‌వాడీ, ఏఐకేఎస్, విద్యుత్, ఆటో కార్మిక తదితర కార్మిక సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన చేపట్టి అందరిని ఆలోచింపజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేసి, పనిప్రదేశాల్లో కార్మికులకు రక్షణ కల్పించాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 8గంటల పనిదినాలను కల్పించాలన్నారు. మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నీరుగార్చిందని, సులభతర వాణిజ్యం నెపంతో కార్మికులకు వ్యతిరేకంగా ఆదాని, అంబానీ లాంటి కార్పొరేట్ కార్మికులకు అనుకూలంగా బ్రిటీషు కాలంనాటి చట్టాలను సైతం మార్పులకు చర్యలు తీసుకుంటారని విమర్శించారు.





సమస్యల పరిష్కారం కోసం వినూత్న నిరసన చేపట్టిన కార్మికులు

డీసీసీలో అధ్యక్ష గోల..!


(5వ పేజీ తరువాయి)

దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న క్యాడర్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో నేటికీ చెక్కుచెదరలేదు. నడిపించే సారధిలేక పోవడంతో దిగువ స్థాయి నాయకులు, కార్యకర్తలు పార్టీని నమ్ముకుని జిల్లా కార్యాలయం చుట్టు నేటికి తిరుగుతూనే ఉన్నారు. గత నెలలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ పరిస్థితిపై సమీక్షించిన సమయంలో ఒక్కసారిగా పార్టీలోని వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. పార్టీకి విధేయులుగా ఉన్నవారినే డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి జిల్లా అధ్యక్ష స్థానంలో మాజీ గవర్నర్ పెండెకంటి వెంకట సుబ్బయ్య, బీజీ ఎల్లయ్య, మద్దూరు సుబ్బారెడ్డి లాంటి ఎందరో ఉద్దండులు వన్నె తెచ్చారు. అటువంటి పార్టీకి నేడు సరైన నాయకుడు లేక వెలవెలబోతోంది. ఈ క్రమంలో ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్‌ను జిల్లా ఇన్‌చార్జిగా నియమిస్తూ అధిష్ఠానం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాకు సరైన డీసీసీ కమిటీ ఏర్పాటుపై కార్యకర్తలు యాదవ్‌పైనే ఆశలు పెట్టుకున్నారు.

కోటరీల తీరుతో బేజారు..?

కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం కోటరీలతో తలపట్టుకుంటోంది. కోటరీలు, వర్గాలుగా విడిపోయి కుమ్ములాటలకు వేదికగా మారింది. ఓ మాజీ డీసీసీకి విధేయుడుగా ఉంటూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోస్టులో పార్టీని గాడిలో పెట్టేందుకు తన వంతు ప్రయత్నాలు చేశారు. ఆయన వ్యవహారం కొందరికి తలనొప్పిగా మారడంతో ఆయన్ను కొన్ని కోటరీలు పార్టీనుంచే బహిష్కరించేలా చక్రం తిప్పాయి. ఆయన కూడా ప్రస్తుతం డీసీసీ సీటు కావాలంటూ మాజీ మంత్రి మారెప్పద్వారా ప్రకటనలు ఇప్పిస్తుండగా, మరి కొందరు తమ పేరు కూడా రాయలేని వారు, రాజకీయ ఓనమాలు తెలి యని వారు సైతం డీసీసీ పీఠం కోసం పైరవీలు చేస్తున్నారు. మాజీ డీసీసీలు కొందరు ప్రయత్నాల్లో ఉండగా మరి కొందరు వారి పక్కనే ఉంటూ వారికి తెలియకుండా డీసీసీ పీఠం తమకే దక్కాలంటూ తెరచాటు ప్రయత్నాలు చేస్తున్నారు.

పార్టీని బలోపేతం చేస్తాం



పార్టీని నియోజవర్గాల వారీగా బలోపేతం చేస్తాం. అధిష్ఠానం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటా. జిల్లాకు బలమైన డీసీసీని ఏర్పాటు చేయాల్సి ఉంది. పార్టీని నమ్ముకుని దశాబ్దాల కాలం నాటి నుంచి పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులకు ప్రాధాన్యం ఇస్తాం. పటిష్ట ప్రణాళికతో పార్టీని బ్రతికించుకు నేందుకు ప్రతి ఒక్కరిని ఐక్యంగా ఉండి పని చేసే విధంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. త్వరలోనే నియోజ కవర్గాల సమీక్ష చేపట్టి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం.

- జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్, ఏఐసీసీ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జి

పెద్ద పండుగ

(5వ పేజీ తరువాయి)

● పీటీఎం నిర్వహణకు పాఠశాల కాంపోజిట్ గ్రాంట్

సమావేశానికి కావాల్సిన వస్తువులు, పరికరాలు, ఇతర అవసరాల కోసం పాఠశాలకు కేటాయించిన స్కూల్ కాంపోజిట్ గ్రాంట్‌నుంచి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఖర్చు చేయాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఖర్చులు, కొనుగోళ్లు, ఇతర వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, దాతల సహకారం కూడా కోరవచ్చని జీవోలో పేర్కొన్నారు.

పాటించాల్సినవి

పాఠశాలలను మామిడి తోరణాలు, అరటి బోదెలు, రంగుల కాగితాలను ఉపయోగించి అందంగా అలంకరించాలి. పాఠశాల ఆహ్లాదకరంగా పచ్చదనంగా ఉండేలా మొక్కలు నాటాలని ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులతో కలిసి కనీసం ఒక్క మొక్క అయినా నాటేలా ప్రోత్సహించాలని ప్రభుత్వం ఇప్పటికే పిలుపునిచ్చింది. తల్లుల కోసం ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీల నిర్వహణ. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులను కలిపి అభిప్రాయ సేకరణ జరుగుతుంది. అదేవిధంగా మధ్యాహ్నం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో అందరూ కలిసి సహపంక్తి భోజనం చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.



గతంలో కంటే భిన్నంగా నిర్వహిస్తాం



మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను గతంలో కంటే భిన్నంగా ఆదర్శవంతంగా నిర్వహిస్తాం. విద్యార్థులను వారి తల్లిదండ్రులను, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి పండుగలా నిర్వహిస్తాం. బనగానపల్లె ప్రభుత్వ బాలికల పాఠశాలలో మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి, నంద్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌లు పాల్గొంటున్నారు.

- జనార్దన్‌రెడ్డి, డీఈవో, నంద్యాల

స్కూల్ కాంపోజిట్ నిధుల నుంచి ఖర్చు



మెగా పీటీఎంను గ్రాండ్‌గా నిర్వహించేందుకు దాతలతో పాటు స్కూల్ కాంపోజిట్ నిధుల నుంచి ఖర్చు చేసేవిధంగా ప్రధానోపాధ్యాయులను ఆదేశించడం జరిగింది. ఎక్కడా ఏ మాత్రం రాజీపడకుండా ఈవెంట్‌ను నిర్వహించాలని సూచించాము. అన్ని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సత్సంబంధాలు ఉండే విధంగా కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించింది. తల్లిదండ్రులు తప్పకుండా పాల్గొనాలని కోరుతున్నాము. **- ప్రేమంత్‌కుమార్, ఏపీసీ సర్వశిక్షా అభియాన్, నంద్యాల జిల్లా**

అద్భుతంగా మెగా పీటీఎం ఏర్పాట్లు



కర్నూలు జిల్లాలో మెగా పీటీఎం కార్యక్రమాల ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయి. కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నాము. ఇలాంటి సమావేశాల ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సంబంధాలు బలపడి పాఠశాలల అభివృద్ధికి దోహదపడుతాయి. గురువారం కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్ బాషా, కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపి బస్తిపాటి నాగరాజు, బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల, పాఠశాలలో కార్యక్రమాల్లో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జాయింట్ కలెక్టర్లు హాజరవుతారు.

- శామ్యూల్ పాల్, డీఈఓ, కర్నూలు

విజయవంతం చేయండి: కలెక్టర్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యులను చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించే సమావేశాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఖచ్చితంగా భాగస్వాములను చేయాలని ఆదేశించారు. గత సంవత్సరంలో సాధించిన ఫలితాలు, నివేదికలతో, తల్లికి వందనం పథకం తదితర అంశాలపై చర్చించాలని అన్నారు. పాఠశాలల్లో చేపడుతున్న క్రీడలు, పాఠశాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను తల్లిదండ్రులకు వివరించాలని, ఆటల పాటలు కూడా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షేమం ఎరుగని మత్స్య కార్మికులు

- గత వైసీపీ పాలనలో పథకాలన్నీ కనుమరుగు..
- నేడు ఒక్కో పథకం అమలులోకి..
- నేడు జాతీయ మత్స్యకారుల దినోత్సవం



పాచిపట్టి నిరుపయోగంగా మారిన చేపల తొట్లు

కర్నూలు అగ్రికల్చర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం ఇచ్చే శాఖల్లో మత్స్యశాఖ ఒకటి. గత వైసీపీ పాలనలో మత్స్యకారుల సంక్షేమ పథకాలను పూర్తిగా రద్దయ్యాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు లక్ష మంది మత్స్యకారులు ఉన్నారు. నేడు జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వం తమను ఆదుకోవాలని జాతీయ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కార్మికులు కోరుతున్నారు.

కర్నూలు జిల్లాలో మత్స్యశాఖ అధీనంలో 178 చెరువులు, 8 రిజర్వాయర్లు వున్నాయి. సుంకేసుల, గాజులదిన్నె, కర్నూలు, మంత్రాలయంలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలను నిర్వహిస్తున్నారు. కర్నూలులో 1956లో ఏర్పాటు చేసిన చేపపిల్లల ఉత్పత్తి కేంద్రానికి ఎంతో చరిత్ర ఉంది. ఈ కేంద్రం రాయలసీమలోనే చేపపిల్లల పెంపకం కోసం చేపట్టిన మొదటి కేంద్రం అని అధికారులు తెలిపారు. జిల్లాలో దాదాపు లక్ష మంది చేపల పెంపకం విక్రయాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. చేపపిల్లల పెంపకం ద్వారా వస్తున్న ఆదాయంలో 50 శాతం నీటి సంఘాలకు, 30 గ్రామ పంచాయతీలకు, 20 శాతం డి పార్టుమెంటుకు ఇచ్చేలా గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో మత్స్యకారుల జీవనోపాధికి గొడ్డలివేటులా మారింది. ఈ జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేసి, ఒక్కో పథకాన్ని పునరుద్ధరించడంతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగు వచ్చినట్లయిందని ఉమ్మడి జిల్లాల మత్స్యకారుల సహకార యూనియన్ చైర్మన్ నవీన్ కుమార్ తెలిపారు.



శిథిలావస్థలో జిల్లా మత్స్యశాఖ కార్యాలయం

మత్స్యకార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతాం



గత వైసీపీ పాలనలో మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. ఆ పరిస్థితి నుంచి వారిని గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామాల్లో మత్స్యకార సంఘాలను బలోపేతం చేస్తున్నాం. అర్హత ఉన్న మత్స్యకారుల ఒదరికీ ఈ సంఘాల్లో సభ్యత్వం కల్పించేందుకు చర్యలు చేపట్టాము. **- నవీన్ కుమార్, ఉమ్మడి జిల్లా మత్స్యకారుల యూనియన్ చైర్మన్ నవీన్ కుమార్**

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం



మత్స్యకారుల జాతీయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. తుంగభద్ర నదితీర సమీపంలో చేపల పెంపకం ఎక్కువగా జరుగుతోంది. ఇందులో భాగంగా కోసిగిలో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం.

- రంగనాథరావు, డిప్యూటీ డైరెక్టర్

రాయలసీమలో మత్స్యకారుల శిక్షణ కేంద్రం

రాయలసీమలోని 4 జిల్లాల్లో చేపల పెంపకంతో పాటు వాటి వేటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సాంకేతిక పద్ధతులను నేర్పించేందుకు కర్నూలులోని బంగారుపేటలో 1977లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మూడు నెలల పాటు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటిదాకా 123 బ్యాచ్‌లలో 2,559 మందికి శిక్షణ ఇచ్చారు.

బకాయిలపై ప్రత్యేక దృష్టి

- వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నీరజ



కర్నూలు న్యూసిటీ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ, పాత బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జే. నీరజ తెలిపారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం గుత్తి పెట్రోలు బంకు సమీపంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర జిల్లాల కంటే కర్నూలు జిల్లా జీఎస్టీ వసూళ్లు అత్యధికంగా ఉన్నాయన్నారు. గత సంవత్సరం ఏప్రిల్‌లో రూ.89.404 కోట్ల జీఎస్టీ రాగా, ఈ సంవత్సరం 12 శాతం ఎక్కువగా ఏప్రిల్‌లో రూ.99.55 కోట్ల జీఎస్టీ వసూలైందన్నారు. జిల్లాలో గ్రీన్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీ, మైనింగ్, సిమెంట్, ఐరన్ ఓర్ తదితర కార్యకలాపాల వల్లనే ఇది సాధ్యమైందన్నారు. సంవత్సరానికి రూ.1,120 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారన్నారు. అంతే కాకుండ పాతబకాయిలు(ఏపీజీఎస్టీ, ఏపీ వ్యాట్, జీఎస్టీ) ఇప్పటి వరకు రూ.150 కోట్లు ఉండగా అందులో కేవలం ఆదోని సర్కిల్ పరిధిలో రూ.90 కోట్లు, నంద్యాల సర్కిల్ పరిధిలో రూ.40 కోట్లు, కర్నూలు సర్కిల్ పరిధిలో రూ.10 కోట్లు ఉన్నాయన్నారు. బకాయిలు చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మద్దికెర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ శివారులో బైక్, టీవీఎస్ వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. బంధువులు, ఎస్ఐ కథనం మేరకు.. పత్తికొండ మండలం కైరుప్పల చెన్నంపల్లి గ్రామానికి పెద్ద తిరుపతిరావు(23) భార్య, కుమాడిని చూసేందుకు గుంతకల్లు మండలం గూలి పాల్యం గ్రామానాకి నెల 8వ తేదీన వెళ్లాడు. తిఇరిగి బుధవారం మధ్యాహ్నం స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా మద్దికెర శివారులో ఎదురుగా వస్తున్న టీవీఎస్ 50 వాహనం ఢీకొట్టి, కల్వర్టు పక్కన ఎగిరిపడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రాశి, మూడు నెలల కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ విజయకుమార్ నాయక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం మార్చురికి తరలించారు.



తిరుపతిరావు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్..

ఓర్వకల్లు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై నన్నూరు గ్రామ సమీపాన గల విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా బుధవారం తెల్లవారుజామున బొలేరో పికప్ వాహనం యూటర్న్ డీవైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం నందికుంట గ్రామానికి చెందిన డ్రైవర్ గజ్జలకొండ వేణు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ వాహనాన్ని కడప నుంచి హైదరాబాదుకు తీసుకెళ్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

- భార్య ఎడబాటుతో పెట్రోలు పోసుకుని..

నందికొట్కూరు రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఎడబాటుకు గురైన భర్త ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నందికొట్కూరు మండలంలోని శాతనకోట గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన చిన్న మహ్మద్ కుమారుడు షేక్ ఇస్మాయిల్(29) భార్య ఫయజున్ బీ గొడవపడి వెంకటాపురంలోని పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఇస్మాయిల్ మనస్తాపానికి గురయి యింట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు చూసి మంటలను ఆర్పి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బ్రాహ్మణకొట్కూరు ఇన్‌చార్జ్ ఎస్సై ఓబులేసు తెలిపారు.



షేక్ యిస్మాయిల్ (ఫైల్)

తల్లీ కొడుకుల ఆత్మహత్యాయత్నం..

- తల్లి మృతి.. కొడుకు పరిస్థితి విషమం

మంత్రాలయం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోన గ్రామానికి చెందిన బోయలక్ష్మి(31), ఆమె కుమారుడు అమోఘవర్ధన్(11) క్రిమిసం హారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం జరిగింది. చిలకలడోన గ్రామానికి చెందిన లక్ష్మి, విజ యుడు దంపతులకు అమోఘవర్ధన్, శ్రీలేఖ సంతానం. విజయుడు బావమరుదలు అతని వద్ద అప్పు తీసుకొని తిరిగి ఇవ్వలేదు. ఈ విషయంపై భార్యతో అంతా నీ వల్లే జరిగిందని కోపంగా మాట్లాడాడు. దీనికి తోడు 2020లో లక్ష్మి రోడ్డు ప్రమాదంలో గాయపడి కొద్ది మతిస్థిమితం కోల్పోయింది. భర్త మాటలకు మనస్తాపానికి గురైన లక్ష్మి మంగళవారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగుల మందును మ్యాంగో జ్యూస్‌లో కలుపుకుని తాగి, కొడుకుకు కూడా ఇచ్చింది. వీరిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మి కోలుకోలేక మృతి చెందింది. కొడుకు పరిస్థితి విషమంగా ఉంది. అతడిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి అన్న కామనదొడ్డి గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు.



బోయ లక్ష్మి (ఫైల్)

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



మరియమ్మతో పోలీసులు

ఆత్మకూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశంతో ఆత్మకూరు పోలీసులు మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఈ వారంలో రెండు మిస్సింగ్ కేసులను ఛేధించగా బుధవారం మరో ఒక కేసును పరిష్కరించారు. ఆత్మకూరు మండలంలోని

నల్లకాల్వ గ్రామానికి చెందిన మరియమ్మతో అదే మండలంలోని శ్రీపతిరావుపేటకు చెందిన ఏసన్నకు వివాహమైంది. రెండేళ్ల తర్వాత వారి మధ్య మనస్పర్థలు రావడంతో 2022లో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పట్లో ఆమె భర్త ఏసన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మరియమ్మ హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించినట్లు ఆత్మకూరు అర్బన్ సీఐ రాము తెలిపారు. పోలీసులు ఆమెను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు

స్థల వివాదంలో ఘర్షణ..

- యువకుడికి గాయాలు

మంత్రాలయం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లి గ్రామానికి చెందిన మదార్‌బీ, ఆమె కొడుకు అమీర్‌లపై అదే గ్రామానికి చెందిన వీరేష్, అతని భార్య, కొడుకులు దాడి చేశారు. ఈ ఘటనలో అమీర్ తలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం జరిగింది. ఇంటి స్థలం విషయంపై మదార్‌బీ, వీరేష్ మధ్య విభేదాలు ఉన్నాయి. వారి మధ్య మాటామాటా పెరిగి బల్లక వీరేష్, అతని భార్య కుమారులు కర్రతో అమీర్ తలపై మోదారు. దీంతో ఆయనకు రక్తగాయాలయ్యాయి. అమీర్‌ను ఆసుపత్రికి తరలించారు. మదార్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరేష్ కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాధవరం హెడ్ కానిస్టేబుల్ విజయ్ తెలిపారు.

నకిలీ వ్యక్తులతో రిజిస్ట్రేషన్

- మృతుల పేరుతో అక్రమం
- చేతులు మారిన రూ.18లక్షలు
- ఐదుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎం.తబ్రేజ్

కోడుమూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన వ్యక్తుల పేరుతో 5 సెంట్ల స్థలాన్ని నకిలీ వ్యక్తులు మరొకరికి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఈ కథ బెడిసికొట్టి చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలు అయ్యారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం విలేకర్ల సమావేశంలో సీఐ ఎం.తబ్రేజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు పట్టణానికి చెందిన అన్నదమ్ములు కాకే నారాయణ, కాకే నాగరాజు 1984లో కోడుమూరు సమీపంలోని 100 సర్వే నంబర్‌లో ఐదు సెంట్ల స్థలాన్ని కొన్నారు. అనారోగ్యంతో 2013లో నారాయణ, 2014లో నాగరాజు మృతి చెందారు. గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన సోమేష్, కోడుమూరు పట్టణానికి చెందిన బోయ మధు, కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన రాజోలి గిడ్డయ్య కలిసి చనిపోయిన అన్నదమ్ముల పేర్లు ఉన్న వ్యక్తుల పట్టుకొని వారి ఐదు సెంట్ల స్థలాన్ని కాజేయాలని ప్రథకం వేశారు. గోనెగండ్ల మండలం పెద్దనెలటూరు గ్రామానికి చెందిన బోయ నారాయణ, నాగరాజు అనే వ్యక్తులను వెతికి పట్టుకున్నారు. ఆ తర్వాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని అధికారులతో కుమ్మక్కై ఐదు సెంట్ల స్థలాన్ని 2023లో ఆ నకిలీ వ్యక్తులతో రిజిస్టర్ చేయించారు. ఐదు సెంట్ల ప్లాట్‌ను అమ్మగా వచ్చిన రూ.18లక్షలను అందరూ సమానంగా పంచుకొన్నారు. చనిపోయిన కాకే నారాయణ భార్య లీలావతి భర్త కొనుగోలు చేసిన స్థలాన్ని చూసేందుకు ఇటీవల కోడుమూరుకు వచ్చింది. ఆ సందర్భంగా అసలు విషయం బైటపడింది.

లీలావతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ డివై.స్వామి విచారణ చేపట్టి బుధవారం సోమేష్, మధు, రాజోలి గిడ్డయ్య, బోయ నారాయణతో పాటు ఇందుకు సహకరించిన మాదాసు నాగేష్‌ను అరెస్టు చేశారు. నిందితులు నాగరాజు, విష్ణు పరారీలో ఉన్నారు. ఈ కేసులో మరి కొంత మందిని విచారించాల్సి ఉందని సీఐ చెప్పారు.

బాలాపురంలో చోరీ

- రూ. 1.10 లక్షలు, బంగారు, వెండి వస్తువులు, ప్రామిసరీ నోట్ల అపహరణ



దొంగలు ధ్వంసం చేసిన బీరువా

వెల్దుర్తి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలం బాలాపురం గ్రామంలో భారీ చోరీ జరిగింది. కృష్ణమోహన్‌రెడ్డి, మల్లమ్మ దంపతులు మంగళవారం రాత్రి వర్షం కురుస్తుండడంతో పాత ఇంటిలో నిద్రించడం అంత సురక్షితం కాదని, దగ్గర్లో ఉన్న కుమారుడు మధుసూదన్‌రెడ్డి ఇంటికి వెళ్లి నిద్రించారు.బుధవారం తెల్లవారు జామున వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంటిలోకి వెళ్లగా బీరువా తలుపులు తెరచి వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. బీరువాలో రూ.1.10 లక్షల నగదు, 3 తులాల బంగారు, 20 తులాల వెండి వస్తువులు, రూ.10లక్షల విలువైన ప్రామిసరి నోట్లు గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బాధితుడు వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశాడు. చోరీ జరిగిన ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

దుకాణానికి నిప్పు..

- బీజేపీ, వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు


ఆదోని రూరల్, జూలై 9 ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డనగేరి గ్రామంలోని ఓ దుకాణానికి నిప్పు పెట్టడంతో దగ్ధమూ రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు ఈడిగ శంకర్ వాపోయాడు. బాధితుడి కథనం మేరకు.. స్థానిక ఆర్ అండ్ బీ స్థలంలో దుకాణం పెట్టుకున్నాడు. అయితే గ్రామానికి చెందిన బీజేపీ, వైసీపీ కార్యకర్తలు శ్రీరాములు, దాసప్ప, గర్జప్ప, జయరాం, నాగరాజు, సూరి మంగళవారం అర్థరాత్రి దాటాక పెట్రోలు పోసి నిప్పటించారు. మూడురోజుల క్రితం ఎమ్మెల్యే పార్థసారధి పేరు చెప్పి భయభ్రాంతులకు గురి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్ద తుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.



కాలిబూడిదైన దుకాణం

ప్రజాప్రతినిధికి అంగన్‌వాడీ పోస్టు!

- వైసీపీకి సహకరించిన టీడీపీ
- ఓ నాయకురాలి లోపాయికారి ఒప్పందం?



Kurnool Local Authorities Constituency Photo Identity Card

Name of the Elector	: SHYAMALAMMA
MPTC	: MPTC AREKAL
Local Authority	: MPP, Adoni
Elector part No.	: 01
Serial No	: 24
Part Name	: RDO office, Adoni
EPIC No.	: RTM0736637
Adhaar Number	: 565391288425

Signature of the MPTC

Mandal Parishad Dev. Officer
Mandal Praja Parishad, Adoni.
Kurnool District.

ఎంపీటీసీ సభ్యురాలు శ్యామలమ్మ గుర్తింపు కార్డు

ఆదోని రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అంతా ఒక వైపు.. ఆదోని మాత్రం మరో వైపు అన్నట్లు ఉన్నాయి ఇక్కడి రాజకీయ పరిస్థితులు. ప్రతిపక్షంలో ఉండగా పోరాడిన టీడీపీ శ్రేణులను కాదని ఆదోని నియోజకవర్గంలో వైసీపీ నుంచి వచ్చి వారికి, ఇంకా ఆ పార్టీలో ఉన్న వారికే అగ్రతాంబూలం ఇస్తున్నారు ఇక్కడి నేతలు. కూటమి జెండాలు మోసిన కార్యకర్తలను కాదని ప్రత్యర్థి పార్టీకి చెందిన వారికి ప్రతిఫలం చేకూర్చేలా ఇక్కడి రాజకీయం మారింది. తాజాగా వైసీపీ మద్దతు గెలిచిన ఓ ఎంపీటీసీ సభ్యురాలికి అంగన్‌వాడీ పోస్టును ఇచ్చేశారు. ఈ పోస్టు కేటాయింపులో తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ మహిళా నాయకురాలు లోపాయికారిగా ఒప్పందం కుదుర్చుకుని పోస్టు రావడంలో సహకరించినట్లు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధిగా ఉన్న వారు ప్రభుత్వ పోస్టుల్లో కొనసాగడానికి అనర్హులు. కానీ ఆదోని మండలం ఆరేకల్లు గ్రామానికి చెందిన శ్యామలమ్మ (వివాహం తర్వాత పేరుమార్పు)... వైసీపీలో క్రియాశీలకంగా ఉన్నారు. 2021 సెప్టెంబరు 24న వైసీపీ మద్దతుతో ఎంపీటీసీగా గెలిచారు. కానీ టీడీపీ ప్రభుత్వం మారిన తర్వాత తాజాగా ఆమెకు అంగన్‌వాడీ-2 కేంద్రంలో సహాయకురాలిగా పోస్టు వచ్చింది. అయితే ప్రజాప్రతినిధిగా ఆమె శ్యామలమ్మగా ఉండగా... అంగన్‌వాడీ పోస్టుకు వచ్చేసరికి ఆమె పేరు ఈరమ్మగా మారింది. విద్యార్హత పత్రాల్లోనూ ఆమె పేరు ఈరమ్మగానే ఉండటం విశేషం. అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తు చేసుకునే సమయానికి ఆమె తన పదవికి రాజీనామా చేయలేదు. అయినప్పటికీ అధికారులు ఆమెకు పోస్టును ఎలా కేటాయించారో వారికే తెలియాలి. అయితే రెండు పేర్లు ఉండటం ఆమెకు కలిసివచ్చింది. ఈ విషయంపై ఆదోని ఎంపీడీఓ జనార్దన్‌ను వివరణ కోరగా... ఆరేకల్లు ఎంపీటీసీగా కొనసాగుతున్న శ్యామలమ్మ పదవికి రాజీనామా చేయలేదన్నారు.

ఎంపీటీసీ అని తెలియదు

ఆరేకల్లు అంగన్‌వాడీ సెంటర్-2లో సహాయకురాలిగా ఈరమ్మకు గత నెలలో ఉద్యోగం వచ్చింది. సర్టిఫికెట్ల ఆధారంగా ఆమె పేరు ఈరమ్మ. ఆమె ఎంపీటీసీ అన్న విషయం తెలియదు. ఆమె శ్యామలమ్మ పేరుతో ప్రజా ప్రతినిధిగా కొనసాగుతున్నారన్నది తెలియదు. ప్రజా ప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ ఉద్యోగం చేయడానికి వీలులేదు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

- ఉమామహేశ్వరి, సీడీపీఓ, ఆదోని

వివాదాస్పదంగా మొహర్రం

- రాంపల్లెలో పోలీసులచే పీర్ల ఊరేగింపు



పోలీసుల బందోబస్తు మధ్య ఊరేగింపు

చాగలమర్రి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లె గ్రామంలో మొహర్రం సందర్భంగా ఇరు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఇరువర్గాల మధ్య పట్టింపుతో పీర్ల ఊరేగింపు ఉద్రిక్తంగా మారింది. ఈ వివాదం ఎస్పీ వరకు వెళ్లింది. రెండేళ్ల నుంచి పట్టింపులతో మొహర్రం కేవలం గ్రామ చావిడికే పరిమితమైంది. ఈ ఏడాది ఎలాగైనా పీర్లను ఊరేగించాలని అధికార పార్టీ వర్గీయులు పట్టుబడటంతో మరో వర్గం వారు తాము పీర్లను తిప్పాలని పట్టుబట్టారు. పోలీసులే పీర్లను ఊరేగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీంతో మంగళవారం అర్ధరాత్రి క్యూఆర్టీ పోలీసులు పీర్లను ఎత్తుకొని జనసందోహం, దివిటీల నడుమ ఊరేగించారు.ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, ఆళ్లగడ్డ పట్టణ సీఐలతో పాటు చాగలమర్రి ఎస్ఐ సురేష్, మరో ఇద్దరు ఎస్ఐలు, మరో 20 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఏపీ బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్ వెంకటరామరాజు



ఎన్ వెంకటరామరాజుతో ఏపీబీఎస్ఎస్ కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎన్ వెంకటరామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పాత నగరంలోని శంకర మఠంలో ఏపీబీఎస్ఎస్ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి మంకాల కృష్ణకాంత్ శర్మ ఆధ్వర్యంలో సమాఖ్య కార్యవర్గ సమావేశం జరిగింది.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ఆదోని అగ్రికల్చర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్లుబావి ప్రాంతంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండవ పట్టణ పోలీసులు తెలిపిన మేరకు.. ప్రకాష్‌నగర్‌కు చెందిన బజారి కుమారుడు లాజర్ పట్టణంలోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. రాత్రి ఇంట్లో ఉరేసుకున్నట్లు సమాచారం వచ్చింది. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌వోలు కీలకం

కమిషనర్ రవీంద్రబాబు


మాట్లాడుతున్న రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌వోల పాత్ర చాలా కీలకమైందని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అన్నారు. బుధవారం ఎస్‌టీబీసీ కాలనీలోని సమావేశ భవనంలో బీఎల్‌వోలకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రవీంద్రబాబు మాటాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా బీఎల్‌వోలకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఒక్కరోజు 50 మంది బీఎల్‌వోలకు చొప్పున 250 మందికి శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం 30 మార్కుల పరీక్ష పెట్టి సర్టిఫికెట్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దారు రవికుమార్, డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాషా, ఆర్‌ఐ రాజు, సీనియర్ అసిస్టెంట్ సాధిక్, పాల్గొన్నారు.

కల్లూరు: ఎన్నికల విధుల్లో బీఎల్‌వోలకు కల్లూరు తహసీల్దార్ కె.ఆంజనేయులు ఆధ్వర్యంలో శిక్షణ అందించారు. బుధవారం ఎలక్షన్ కమిషన్, పాణ్యం రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు బీసీ స్టడీ సర్కిల్లో రెండో రోజు బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా తహసీల్దారు ఆంజనేయులు మాట్లాడుతూ ఓటర్ల నమోదులో ఫారం-6,7,8 తీసుకుని అప్‌డేట్ చేయాలన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కం టహ ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కొత్త బీఎల్‌వోలకు 8వ తేదీ నుంచి 12 వరకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు విష్ణుప్రసాద్, ఎలక్షన్ డీటీ అనూరాధ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి: ఏవో


హుశేనాపురంలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో మధుమతి

ఓర్వకల్లు, జూలై 9(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డీఆర్‌సీ ఏడీఏ రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని హుశేనాపురంలో ఏవో మధుమతి, పూడిచర్లలో ఏడీఏ రాజశేఖర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. పత్తికి రూ.2వేలు, వేరుశనగకు రూ.560, అరటికి రూ.3,025 ప్రీమియాన్ని జూలై 15వతేదీలోపు చెల్లించాల న్నారు. కార్యక్రమంలో ఏఈవో మధు, రైతులు వెంకటేశ్వర్లు, నజీర్ అహ్మద్, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, ప్రకాశం, తిరుపాలు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే దస్తగిరి


డ్రైనేజీని పరిశీలిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

గూడూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): గూడూరు తెలుగు వీధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి నగర పంచాయతీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కురిసిన వర్షానికి డ్రైనేజీ ఉప్పొంగి నీరు ముందుకు వెళ్ళక పోవడంతో తెలుగువీధిలోని ఇళ్లల్లోకి పోవడంతో ఆగ్రహించిన మహిళలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కమిషనర్ రమేష్‌బాబు స్థానిక టీడీపీ నాయకులు తెలుగువీధిలో డ్రైనేజీ సమస్యను పరిశీలించి, కాలనీవాసులతో మాట్లాడారు. తక్షణం డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కమిషనర్ రమేష్‌బాబును ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు కె.రామాంజనేయులు, నాయకులు రేమట వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్ ఉన్నారు.

టీకాలపై అవగాహన కల్పించండి


హుశేనాపురంలో టీకాలను పరిశీలిస్తున్న డాక్టర్ రఘు

ఓర్వకల్లు, జూలై 9(ఆంధ్రజ్యోతి): వ్యాధి నిరోధక టీకాలపై గర్భిణులకు, ఐదేళ్ల పిల్లలకు అవగాహన కల్పించాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. బుధవారం హుశేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి సుకన్య, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సమగ్ర ప్రగతి పత్రాలు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సమగ్ర ప్రగతి పత్రాలను అందజేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ సిద్ధమవుతుందని రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత తెలిపారు. బుధవారం నగరంలో 48వ వార్డు రోజా వీధిలో జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఆరోగ్యం అకాడమిక్ లక్ష్యాలు నైపుణ్యాలను సమగ్రంగా పొందుపరిచేందుకు తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకుని 8పేజీలుగా సమగ్ర ప్రగతి పత్రా న్ని అందజేస్తారన్నారు. స్పందించే తత్వం, సృజనాత్మకత వెలికి తీసేందుకు ఆరు నెలలకు ఒకసారి పిల్లల సంబంధిత ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- కార్మిక సంఘాల డిమాండ్
- దేశవ్యాప్త సమ్మె విజయవంతం

గూడూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం గూడూరులో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గూడూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. కార్యక్ర మంలో సీఐటీయూ నాయకుడు వెంకటేశ్వర్లు, హమాలీ, ఆశా, మున్సిపల్, ఆటో, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

ఓర్వకల్లు: ప్రభుత్వ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం చట్టం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న కోరారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ఓర్వకల్లులో బుధవారం రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రజా సంఘాల కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముం దు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూ దన్ అధ్యక్షత వహించారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాలను బంద్ చేయించారు. కార్యక్రమంలో నాయకులు మాసూంబాషా, దస్తగిరి, దానమయ్య, ఆశా వర్కర్లు, కార్మికులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కులను కాపాడాలి

కర్నూలు కలెక్టరేట్: జర్నలిస్టుల హక్కులను కాపాడాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోరంట్లప్ప, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు డి.హుశేన్ డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నగర అధ్యక్షుడు ఎం.శివశంకర్ అధ్యక్షతన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఏపీడబ్ల్యూజేఎఫ్ మద్దతు తెలిపింది. జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు కార్మిక, ఉద్యోగ, పెన్షనర్లు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని నిరస న వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం రద్దు చేసిన 44 కార్మిక చట్టాల్లో జర్నలిస్టులకు సంబంధించి వర్కింగ్ జర్నలిస్టుల చట్టం 1955, వేతనాల చెల్లింపు చట్టం 1958 ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. కార్యక్ర మంలో రమేష్, సునీల్ కుమార్, ఎర్రమల, బాబు, నాయకులు ప్రతాప్, మహ్మద్ రఫీ, పురుషోత్తం, బ్రహ్మయ్య, అనిల్, నర్సిరెడ్డి, మద్దిలేటి యాదవ్ పాల్గొన్నారు.

సమ్మెకు ఆర్‌ఎస్‌ఎఫ్ మద్దతు: నగరంలో బుధవారం నిర్వహించిన సమ్మెకు సీఐటీయూ, ఎఫ్‌ఎంఆర్‌ఏ యూనియన్లకు ఆర్‌ఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మహేష్ మద్దతు ప్రకటించారు. మహేష్ మాట్లాడుతూ లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

● సామూహికంగా జర్నలిస్టుల హక్కులను రద్దు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ యునైటెడ్ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో బుధవారం నగరంలో విస్తృత నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్రం తీసుకువచ్చిన కార్మిక కోడ్లతో జర్నలిస్టులు వేతన భద్రత, పని హక్కులు తీవ్రంగా ప్రభావితం అవు తున్నాయని పేర్కొంటూ వాటికి వ్యతిరేకంగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిం చారు. కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు యునైటెడ్ జర్నలిస్టు ఫోరం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కమిటీలు మద్దతు తెలియజేశాయి. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దండు విద్యాసాగర్, కార్యదర్శి చంద్రమోహన్, వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు నీలం సత్యనారాయణ, చిన్న రామాంజనేయులు, జిల్లా గౌరవాధ్యక్షులు యూసుఫ్ కాన్, ప్రసాద్, నాయకులు వడ్డెమాన్ విజయ్, పరమేష్, విజయ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాలు



గూడూరులో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు


ఓర్వకల్లులో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు, నాయకులు

అభివృద్ధి, సంక్షేమంతో సుపరిపాలన

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం కలగలిపిన సుపరిపాలన ఏడాది కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు అందించారని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కల్లూరు మండలం 26, 28 వార్డుల్లోని విఠల్‌నగర్, దూపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. గౌరు చరిత మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని ఉచిత గ్యాస్ సిలిండర్లు, పింఛన్, తల్లికివందనం డబ్బులు పడ్డాయా అని ఆరా తీశారు. అర్బన్ వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసు కుంటున్నామన్నారు. దూపాడులోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతి గదులు, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన, భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఉలిందకొండ సొసైటీ చైర్మన్ ఈవీ. రమణ, వాకిటి మాదేష్, లోకేష్, కె. ధనుంజయ, శేఖర్‌చౌదరి, 26 వార్డు నాయకుడు చరణ్ కుమార్ యాదవ్, అనిల్, నరేష్, ప్రసాద్, వెంకటస్వామి, సుంకన్న, బలరాముడు, మహానంది పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలోని పలుకుదొడ్డి గ్రామంలో బుధవారం సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి హాజరై ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎం. నర్సమ్మ అనే వృద్ధురాలు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ నాయనా చంద్రబాబు ఇచ్చిన మాట తప్పడని, మా ఇంటి ముందు సీసీ రోడ్డు, మురుగు కాలువలు, పింఛన్ అం దించినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్, సింగిల్ విండో ప్రెసిడెంట్ తిమ్మప్ప, తెలుగు యువత అధ్యక్షుడు కొత్తకోట హరి, రాంభూపాల్‌రెడ్డి గిడ్డయ్య గౌడు, అమర్, బాలజీ, గౌస్, ధనుంజయుడు ఎంపీటీసీ ఈరన్నగౌడు, ధనుంజయుడు, భీమన్న, రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.


దూపాడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి: ఎంపీడీవో


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఓర్వకల్లు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఓర్వకల్లులోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, పురోగతి సూచికపై మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలకు జరిగే శిక్షణ కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీనివాసులు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్ డబ్లుఎస్ ఇంజనీర్ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, పురోగతి సూచికపై పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో రాణెమ్మ శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో అనుమతి లేని తాగునీటి కొళాయిల కనెక్షన్లను తొలగించాల న్నారు. అలాగే పంచాయతీల్లో అధికారుల అనుమతి లేకుం డా లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయించే యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల నాయకుడికి పరామర్శ

కర్నూలు హస్పిటల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల కమిటీ ప్రధాన కార్యదర్శి మగ్బుల్ గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నారు. బుధవారం ఉదయం ఆయ న్ను ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవికుమార్ పరామర్శించారు. విభిన్న ప్రతిభావంతుల కమిటీ ప్రధాన కార్యదర్శి కురువ ఎల్లప్ప ఉన్నారు.

అనాథ పిల్లల ఆధార్ గుర్తింపునకు సర్వే

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సాధికార కమిటీ సభ్యుడు


మాట్లాడుతున్న రాయపాటి శ్రీనివాస్

కర్నూలు కల్చరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలావెంకట శేషాద్రి ఆదేశాల మేరకు, ఆధార్ లేని అనాథ పిల్లలకు ఆధార్ కార్డును ఇప్పించి వారికి ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందేలా కృషి చేస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సాధికార కమిటీ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం బంగారుపేటలోని మున్సిపల్ హైస్కూలు ఆవరణలో ఈకార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ కింద ఈ కార్యక్రమాన్ని కర్నూలులో నిర్వహిస్తున్నామన్నారు. విద్య, వైద్యం, పునరా వాసం, షెల్టర్ హోమ్‌లలో ప్రవేశం కోసం తల్లిదండ్రులు లేని అనాథలను ఈ స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించి వారికి ఆధార్ కార్డును ఇవ్వడానికి ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ గీతావాణి, బాలల సంరక్షణ సాధికారిక అధికారి దీప, రంగమ్మ, పాఠశాల ఉపాధ్యాయుడు రఘు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డ్రైవ్


దుకాణంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నిషేధిత పొగాకు ఉత్పత్తుల అమ్మకాలపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌ను కొనసాగిస్తున్నారు. బుధవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు నగరంలో ఉన్న పాఠశాలలు, కళాశాలలకు వంద గజాలలోపు టీ, పాన్, కిరాణం షాపులలో సిగరెట్లు, ఖైనీలు, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న షాపు లలో పోలీసులు తనిఖీలు చేశారు. విద్యాసంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులను విక్రయించే షాపుల యజమానులకు సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం (సీవోటీపీఏ) యాక్టు ప్రకారం జరిమానాలు విధించారు. అలాగే విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించడం లేదని బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యాపారులకు సూచనలు చేశారు.

స్పోర్ట్స్ హాస్టల్ ఎంపిక ప్రారంభం


ఎంపికను పరిశీలిస్తున్న డీఎస్‌డీవో, కోచ్‌లు

కర్నూలు స్పోర్ట్స్, జూలై 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో 4, 5 తరగతుల చిన్నారులకు స్పోర్ట్స్ హాస్టల్ ఎంపిక ప్రక్రియ జరిగింది. జిల్లా వ్యాప్తంగా 36 మంది రిజిస్టర్ చేయించుకున్నారు. ఎంపికకు 26 మంది హాజరయ్యారని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు తెలిపారు. ఎంపిక సజావుగా నిర్వహించామని ఆయన తెలిపారు. ఎంపికైన చిన్నారులు కడప హాస్టల్‌కు ప్రవేశం కల్పిస్తారని తెలిపారు. ఎంపికకు చిన్నారులు 30 మీటర్లు ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బోర్డు జంప్, 1 కేజీ మెడిసిన్ బాల్‌త్రో, 6/10 మీటర్ల షటిల్ రన్, ఫార్వడ్ బెండ్ అండ్ రీచ్, 600 మీటర్ల రన్ టెస్టులు నిర్వహించారు. కోచ్‌లు యూసుఫ్, మహేష్ కుమార్, రవి, కాశయ్య, కిరణ్, ఇర్ఫాన్, గంగాధర్, శేషఫణి, 4, 5 తరగతుల విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

కల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద మిగిలిపోయిన పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రజలు, రైతు సంఘం ఆధ్వర్యంలో సంయుక్తంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత విజ్ఞప్తి చేశారు. బుధవారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని పొగాకు రైతుల సమస్యలపై రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ వినతిపత్రం అందజేశారు. పొగాకు రైతులు ఈఏడాది ఖరీఫ్‌లో వేసిన పంటను కంపెనీలు కొనుగోలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. ఓర్వకల్లు, కల్లూరు, కర్నూలు, వెల్దుర్తి మండలాల్లో రైతులు విస్తారంగా పంట సాగు చేశారని రేటు ఉన్నా కొనుగోలు జరగలేదని ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యను ఇప్పటికే కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు తెలిపామని, ఆందోళనలు చేసినా ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గౌరుచరిత స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కృష్ణ, ఆంజనేయులు, చాంద్‌బాషా, చంద్రబాబు, మల్లేసు, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్, డీన్, విద్యార్థినులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించాలని శ్రీచైతన్య పాఠశాల జోనల్ అధికారి జి.సురేష్, ప్రాంతీయ అధికారి రామాంజనేయులు అన్నారు. బుధవారం నగరంలోని స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక శ్రీనగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ సుహాసిని ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా మిషన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మొక్కలు నాటించారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యతల గురించి ప్రిన్సిపాల్ సుహాసిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటండి, పర్యావరణం కాపాడండి అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్ హుశేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల పరిరక్షణ సమితి రిజర్వేషన్ల ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 3న అనంతపురంలో జరిగే బహుజన ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కుల సంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు, మహిళా సంఘాలు పిలుపునిచ్చారు. బుధవారం బీసీ భవన్ దగ్గర ఉన్న జ్యోతిరావు పూలే దపంతుల విగ్రహాల వద్ద వారు కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ఐక్యవేదిక అధ్యక్షుడు శేషఫణి, ఆర్‌పీఎస్ రాయలసీమ జిల్లాల కన్వీనర్ శంకర్‌గౌడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు, ఆర్‌పీఎఫ్ రాష్ట్ర యుత్ అధ్యక్షుడు పెరుగు శివకృష్ణ యాదవ్‌లు హాజరై ప్రసంగించారు. దేశంలో కులాల వారీగా జనాభా లెక్కలను చేపట్టాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అఖిల భారత బెస్త మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పీజీ వెంకటేశ్, బహుజన రాష్ట్ర అధ్యక్షుడు దత్తు యాదవ్, నాయకులు కుమ్మరి రామకృష్ణ, రవికుమార్, వీవీ నాయుడు, నంది విజయలక్ష్మి, ఆనంద్‌బాబు, కంది వరుణ్ కుమార్, అర్జున్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, సిద్దప్ప, ఎరుకుల రాజ, రజక లక్ష్మిదేవి, మహేశ్వరి, మనోహర్ పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

సి.బెళగల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాణెమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ సమావేశానికి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈసమావేశానికి కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, ఎంపీ నాగరాజు హాజరవుతారన్నారు.

అభివృద్ధి చేయాలి

తుగ్గలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీను అభివృద్ధి చేయాలని ఎంపీడీవో విశ్వమోహన్ సూచించారు. బుధవారం కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో తాగునీరు, మురుగు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు.

శనివారం నో బ్యాగ్ డే



మద్దికెర ఎంఈవో కార్యాలయం

మద్దికెర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం నో బ్యాగ్‌డేగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. మండలంలో జడ్పీ, కస్తూర్బా, ఆదర్శ పాఠశాల, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు మొత్తం 26 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. నూతన మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులు మూడు రోజులకు మించి పాఠశాలకు రాకపోతే తల్లిదండ్రులకు ఫోన్ చేయాలని, ఐదు రోజులకు మించితే ఎంఈవో, సీఆర్‌పీలు విద్యార్థి ఇంటికి వెళ్లి వివరాలు కనుక్కోవలని ఆదేశాలు ఇచ్చారు.



ప్రభుత్వ పాఠశాలలకు మంచి రోజులు

ప్రభుత్వ చర్యలతో ప్రభుత్వ పాఠశాలలకు మంచి రోజులు వచ్చాయి. ఈహాజరు శాతం కూడా పెరిగింది. మధ్యాహ్న భోజనాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. **- రంగస్వామి, ఎంఈవో**

ఎమ్మెల్యేపై ఆరోపణలు సిగ్గుచేటు

మద్దికెర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆరోపణలు సిగ్గుచేటని టీడీపీ మహిళా నాయకులు వడ్డె రామలక్ష్మి, జానకి చౌదరి అన్నారు. బుధవారం పెరవలి గ్రామంలో మాట్లాడుతూ మహిళపట్ల సంస్కారహీనంగా మాట్లాడడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులకు మహిళలంటే చులకన అని, అధికారంలో ఉన్న సమయంలోనూ టలాగే వ్యవహరించారన్నారు. ప్రతిపక్షంలోనూ వారి తీరు మారలేదని అన్నారు. ప్రసన్న కుమార్ రెడ్డి మహిళా ఎమ్మెల్యేకు వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

ఆయుర్వేదంతో ఉపయోగం

మద్దికెర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద మందులు వాడితే ఉపయోగం ఉందని వైద్యాధికారి హుశేన్‌సాహెబ్, సర్పంచ్ నంది కల్పన అన్నారు. బుధవారం ఎడవలి గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 200 మందికి వైద్యపరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఆయుర్వేద మందులతో సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. ఆపద్బంధవ సేవా సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్ కుమార్, ఎడవలి ఆనంద్, నంది జయరాం ఉన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సమస్యల పరిష్కారంలో విఫలం

ఆస్పరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు విరుపాక్షి, బాలకృష్ణ ఆరోపించారు. బుధవారం కూరగాయల మార్కెట్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసన తెలుపుతున్నామన్నారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టాలను పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్నారు. హమాలీ, కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు నాగేంద్రయ్య, కృష్ణమూర్తి, రామాంజనేయులు, చంద్రశేఖర్, ప్రమీల, నాగమణి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు విశ్వకుమారి ఉన్నారు.





నేడు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ జన్మదిన వేడుకలు

- తరలిరావాలని పిలుపునిచ్చిన యువ నాయకుడు గిరి మల్లేష్‌గౌడ్

ఆలూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ ఆలూరు ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ జన్మదిన వేడుకలు గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు టీడీపీ యువనేత గిరిమ ల్లేష్‌గౌడ్ బుధవారం తెలిపారు. సాయిబాబా ఆలయం నుంచి భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అనంతరం కార్యాలయంలో కేక్ కటింగ్ నిర్వహిస్తారని తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పార్టీ మండల కన్వీనర్లు, బూత్ ఇన్‌చార్జిలు, వివిధ హోదాలో ఉన్న నాయులు, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పెద్ద ఎత్తున హాజరై జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.









పీటీఎం నిర్వహించండి

హాలహర్వి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ నిర్వహించాలని ఎంఈవో ంలకు సూచించారు. ఆయన బుధవారం పాఠశాలల హెచ్ఎంలతో సమావేశమయ్యారు.






















సిద్దూ తయారు చేసిన సైకిల్‌పై అతడిని ఎక్కించుకుని తొక్కుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, సిద్దూకు రూ.లక్ష చెక్ అందజేస్తున్న పవన్

భలే ఈ-సైకిల్.. భళా సిద్దూ!

- ఇంటర్ విద్యార్థికి పవన్ అభినందనలు
- ప్రోత్సాహకం కింద రూ.లక్ష అందజేత

అమరావతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో, బ్యాటరీతో నడిచే ఈ-సైకిల్‌ను రూపొందించిన విజయనగరం జిల్లా తెర్లాం మండలం జాడవారి కొత్తవలస గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి రాజాపు సిద్దూను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందనలతో ముంచెత్తారు. వినూత్న ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణకు రూపం ఇచ్చిన సిద్దూ గురించి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పవన్, అతడిని మంగళగిరి క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని ప్రత్యేకంగా మాట్లాడారు. సిద్దూ తయారు చేసిన ఈ-సైకిల్ మూడు గంటలు చార్జింగ్ చేస్తే 80 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. సిద్దూ తయారుచేసిన సైకిల్‌ను పవన్ కల్యాణ్ స్వయంగా నడిపారు. అతడి ఆలోచనలకు అబ్బురపడ్డారు. సిద్దూ రూపొందించిన 'గ్రాసరీ గురూ వాట్సాప్ సర్వీస్' బ్రోచర్‌ను కూడా చూసి ప్రత్యేకంగా అభినందించారు. వినూత్న ఆలోచనలకు మరింత పదునుపెట్టాలని ఆకాంక్షిస్తూ సిద్దూకు రూ.లక్ష ప్రోత్సాహకం అందించారు. ఆ సైకిల్‌పై సిద్దూను కూర్చోబెట్టుకొని పవన్ స్వయంగా నడిపారు.

లిక్కర్ స్కాంలో రజత్ భార్గవ!

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకున్న దర్యాప్తు అధికారులు వామ్మో అంటూ నోరెళ్లబెట్టారు. ఆయనెవరో కాదు జగన్ పాలనలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రజత్ భార్గవ. కొన్ని నెలల క్రితం పదవీ విరమణ చేసిన రజత్ భార్గవకు సిట్ నోటీసులు ఇచ్చింది. ఈ నెల 11న విజయవాడలోని సిట్ కార్యాలయానికి విచారణకు రావాలని పేర్కొంది. లిక్కర్ పాలసీ రూపకల్పన ఎలా జరిగింది? డిస్టిలరీస్ కూడా లేని వారికి మద్యం సరఫరా ఆర్డర్లు ఎలా ఇచ్చారు? రాజ్ కసిరెడ్డి అబ్కారీ శాఖను శాసిస్తుంటే ఎందుకు మౌనం వహించాల్సి వచ్చింది? ధరల నియంత్రణ లేకపోవడానికి కారణమేంటి? కొత్త మద్యం బ్రాండ్లకు అనుమతి ఇవ్వడంలో నిబంధనల ఉల్లంఘనను ఎందుకు పట్టించుకోలేదు? సత్య ప్రసాద్ అనే ఒక ఎక్సైజ్ అధికారికి అన్నీ అప్పగించమని చెప్పిందెవరు? ఏ కొత్త బ్రాండ్ మార్కెట్లోకి వచ్చినా మొదటి నెలలో పదివేల బాక్సులకు మించి ఆర్డర్ ఇవ్వరాదన్న నిబంధనను ఆదాన్‌కు ఎందుకు వర్తింప చేయలేదు? మొదటి నెలలోనే 1.80లక్షల కేసుల మద్యం ఆర్డర్లు ఇవ్వడం వెనుక గల కారణాలేంటి? రిటైల్ అవుట్‌లెట్ల నుంచి పెట్టాల్సిన ఆర్డర్లు రాజ్ కసిరెడ్డి ఆదేశాలతో సత్య ప్రసాద్ ద్వారా డిపో మేనేజర్లు పెడుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు? ఎవరి సిఫారసు మేరకు అనూషను ఎంఐఎస్ విభాగంలో నియమించారు? అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి కోసం స్పెషల్ మెమో ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆమె సైఫ్ అహ్మద్‌కు పంపితే రాజ్ కసిరెడ్డికి వివరాలు పంపి ముడుపులు సేకరించిన వైనం.. తదితరాలను సిట్ అధికారులు రజత్ భార్గవ ద్వారా వెలికి తీయబోతున్నారు. మద్యం ఉత్పత్తి, సరఫరాదారులు ఇచ్చిన ముడుపులు ఎవరెవరికి ఇచ్చారు? ఎవరు ఎంత తీసుకున్నారు? అనే విషయాలపై ప్రశ్నించబోతున్నట్లు తెలిసింది. వీటితో పాటు విధాన పరమైన నిర్ణయాలపై ప్రశ్నించి ఆయన ఇచ్చే సమాధానాల తర్వాత చట్టపరమైన చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉంది.

హెల్మెట్ ధరించక గతేడాది 4,276 మంది మృతి!

- ద్విచక్రవాహన ప్రమాదాలపై హైకోర్టు ఆందోళన
- బెజవాడలో హెల్మెట్ ధారణ పెరిగిందని పోలీసులకు ప్రశంస
- అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలని నిర్దేశం

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): గతేడాది ద్విచక్ర వాహన ప్రమాదాలలో 4,276 మంది మరణించడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీసింది. హెల్మెట్ ధరించే విషయంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమాలను కొనసాగించాలని పోలీసులకు స్పష్టం చేసింది. విజయవాడలో హెల్మెట్ ధరించేవారి సంఖ్య పెరిగిందంటూ పోలీసుల చర్యలను అభినందించింది. నిబంధనలు అతిక్రమించడం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే దుష్ప్రభావాలపై పత్రికలు, టీవీలలో ప్రకటనలు ఇచ్చేందుకు అవసరమైన నిధుల విడుదలకు సంబంధించి పోలీసుల ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని ఆదేశించింది. ట్రాఫిక్ విధుల్లో ఉన్న పోలీసు అధికారులు బాడీ కెమెరా ధరించడం తప్పనిసరి చేయాలని తాము గతంలో ఇచ్చిన ఉత్తర్వుల అమలుపై స్థాయి నివేదిక సమర్పించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులను ఆటోమేటిక్‌గా గుర్తించేందుకు రాష్ట్రంలోని సీసీ కెమెరాలను ఏపీఫైబర్‌నెట్‌కు అనుసంధానం చేస్తున్నామని, సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో ఏపీ ఫైబర్‌నెట్ ఎండీని వ్యాజ్యంలో ప్రతివాదిగా చేరుస్తున్నట్లు ప్రకటించింది. సీసీకెమెరాల అనుసంధానం, సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ ప్రాజెక్ట్ పురోగతిపై తదుపరి విచారణలోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఫైబర్‌నెట్ ఎండీని ఆదేశించింది. విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. కేంద్ర మోటార్ వాహన సవరణ చట్టం నిబంధనలు అమలు చేయకపోవడంతో పెద్ద ఎత్తున రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించినవారికి జరిమానా విధించడంలేదంటూ న్యాయవాది తాండవ యోగేష్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసుల తనిఖీలు విజయవాడకే పరిమితమయ్యాయన్నారు. ఇతర జిల్లాల్లో ఎక్కడా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం లేదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో హెల్మెట్ పెట్టుకున్నవారిని గ్రహాంతరవాసిగా చూస్తున్నారని వివరించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి స్పందిస్తూ.. మోటార్ వాహన చట్టాలపై ప్రభుత్వం నిరంతరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు.

'ఆ సర్క్యులర్' మేజిస్ట్రేట్‌లను బెదిరించేలా ఉంది!

- అలాంటి సర్క్యులర్ జారీ సరికాదు
- హైకోర్టుకు సీనియర్ న్యాయవాది

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత, అభ్యంతరకర పోస్టులు, వ్యాఖ్యలకు సంబంధించి నమోదైన కేసులలో నిందితులకు రిమాండ్ విధించే సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచిస్తూ మేజిస్ట్రేట్‌లకు హైకోర్టు ఇటీవల సర్క్యులర్ జారీ చేసింది. అయితే, ఈ సర్క్యులర్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. న్యాయవాది జయంతి ఎస్‌సీ శేఖర్ పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం హైకోర్టు విధులు ప్రారంభమైన వెంటనే న్యాయవాది చాపర్ల సీతారామ్ సర్క్యులర్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభిస్తామని మేజిస్ట్రేట్‌లను బెదిరించేలా సర్క్యులర్ జారీ చేయడం సరికాదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఆ సర్క్యులర్ జారీ చేశారని పేర్కొంది. న్యాయవాది సీతారామ్ బదులిస్తూ.. సుప్రీంకోర్టు తీర్పులో మేజిస్ట్రేట్లపై శాఖపరమైన చర్యల గురించే ప్రస్తావించారు తప్ప కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని చెప్పలేదన్నారు. వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని అభ్యర్థించారు. దీంతో ధర్మాసనం ఈ పిటిషన్‌ను లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎన్. సుబ్బారావు వాదనలు వినిపించారు. "హైకోర్టు సర్క్యులర్ సుప్రీం మార్గదర్శకాలకు విరుద్ధం. ఏడేళ్లలోపు జైలుశిక్షకు వీలున్న కేసులలో అర్నేష్ కుమార్ కేసులో ఇచ్చిన మార్గదర్శకాలు వర్తిస్తా యి. సోషల్ మీడియా కేసులలో ఫలానా విధంగానే వ్యవహరించాలని మేజిస్ట్రేట్లను ఆదేశించడం వల్ల తప్పుడు సంకేతాలు వెళ్తాయి' అన్నారు.

నిషేధిత భూముల జాబితాలోకి సివిల్ కోర్టు ఎటాచ్‌మెంట్లు

- దొంగ రిజిస్ట్రేషన్ల రద్దుకు కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీలు
- ఫ్రాంచైజీ అగ్రిమెంట్ల చార్జీలు పెంపు.. జీవోలు జారీ

అమరావతి, జూలై 9(ఆంధ్రజ్యోతి): భూవివాదాలకు సంబంధించి సివిల్ కోర్టులు ఇచ్చే ఎటాచ్‌మెంట్లను నిషేధిత భూముల జాబితాలోని 22సీ విభాగంలో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే కోర్టు ఉత్తర్వుల ద్వారా అటాచ్ చేసిన భూములు రిజిస్ట్రేషన్ చేయరు. కోర్టు ఇచ్చే ఈ ఉత్తర్వు ద్వారా ఒక భూమి లేదా భవనం వంటివి కోర్టు నియంత్రణలోకి వెళ్తాయి. ఇక నుంచి ఈ అటాచ్‌మెంట్ కారణంగా ఆ ఆస్తిని విక్రయించడానికి లేదా బదిలీ చేయడానికి వీలులేకుండా 22సీ విభాగంలో ఉంచుతున్నారు. కాగా, కేఎఫ్‌సీ, డోమినోస్, లెన్స్‌కార్ట్ లాంటి కంపెనీలు ఫ్రాంచైజీలు ఇస్తుంటాయి. ఈ ఫ్రాంచైజీ అగ్రిమెంటు చార్జీలు గతంలో రూ.100 మాత్రమే ఉండేవి. కానీ, ఇప్పుడు ఈ చార్జీలను సవరించారు. లైసెన్సు సమయం ఏడాది లోపు ఉంటే చార్జీలు రూ.1000, ఏడాది నుంచి పదేళ్లలోపు ఉంటే ఏడాదికి రూ.1000 చొప్పున, పదేళ్లకు పైగా ఉంటే రూ.25,000గా నిర్ణయించారు.

బ్రిక్స్ ప్లస్ వర్కింగ్ గ్రూపులో 'విఫ్'

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన బ్రిక్స్ ప్లస్ మాన్యుఫాక్చరింగ్ గ్రూపునకు విశాఖపట్నం మెడ్‌టెక్ జోన్‌లోని 'వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరం (విఫ్)' ఎంపికైంది. ఈ మేరకు మెడ్‌టెక్ జోన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. బ్రిక్స్ దేశాల మధ్య వైద్య పరికరాల తయారీలో సహకారం, పారిశ్రామిక విధానాలు రూపొందించడానికి ఉపయోగపడుతుందని పేర్కొంది. 2026లో బ్రిక్స్ కార్యకలాపాలకు భారత్ అధ్యక్షత వహించనున్న సమయంలో ఈ అవకాశం రావడం విశేషమని మెడ్‌టెక్ జోన్ సీఈవో జితేంద్రశర్మ హర్షం వ్యక్తంచేశారు. ప్రపంచ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్న దేశంగానే కాకుండా ఆరోగ్య సంరక్షణకు పరిష్కారాలు సూచించే కేంద్రంగాను గుర్తింపు లభించిందన్నారు.

విశాఖలో ఇసాయ్ ఫార్మా జీసీసీ

- రాష్ట్రప్రభుత్వం సహకరిస్తోంది
- గీతంతో కలిసి పనిచేస్తాం: గ్లోబల్ సీఈవో

విశాఖపట్నం, జూలై 9(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ కేపబులిటీ సెంటర్ (జీసీసీ)ను విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్నామని, దీనికి రాష్ట్రప్రభుత్వం సహకరిస్తోందని ప్రముఖ ఫార్మా కంపెనీ ఇసాయ్ గ్లోబల్ సీఈవో మకోటో హోకెట్స్ ప్రకటించారు. తమ సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన బుధవారం గీతం విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విశాఖ ఎంపీ, గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్, గీతం కార్యదర్శి భరద్వాజ, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, ప్రొ-వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హోకెట్స్ మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఔషధాల తయారీని విస్తృతం చేయడానికే విశాఖలో జీసీసీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి అవసరమైన పరిశోధనలు, మానవ వనరుల సహకారానికి గీతం వర్సిటీతో కలిసి పనిచేస్తామని చెప్పారు. శ్రీభరత్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కృషి వల్ల విశాఖలో టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్ వంటి సంస్థలు త్వరలో కార్యకలాపాలు ప్రారంభించనున్నాయని.. ఇసాయ్ జీసీసీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. విశాఖలో ఫైజర్, దివీస్, లారస్ ల్యాబ్స్ వంటి సంస్థలకు అవసరమైన కోర్సులను తాము ఇప్పటివరకూ రూపకల్పన చేశామని వీసీ తెలిపారు. సమావేశంలో గీతం సీనియర్ ప్రొఫెసర్లు అరుణ్‌కుమార్, శాంతి, భరణి చంద్రకుమార్, ఐటీ విభాగం డైరెక్టర్ సాయిరామ్, ఇసాయ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విశాఖ యూనిట్ అధిపతి గిరీశ్ దీక్షిత్ పాల్గొన్నారు.

రైతులను సంతృప్తి పరిచాకే 'ఇండోసోల్'కు భూసేకరణ!

- కరేడు గ్రామ ప్రజలందరి సహకారంతోనే ముందుకెళ్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ



(కందుకూరు-ఆంధ్రజ్యోతి)

ఇండోసోల్ పరిశ్రమ ఏర్పాటు కోసం నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో భూసేకరణ ప్రక్రియను అక్కడి రైతులకు అర్థమయ్యేలా వారి సందేహాలు నివృత్తిచేసి, ప్రజల సహకారంతోనే ముందుకు వెళతామని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమాణి శ్రీపూజ చెప్పారు. కొందరిలో భూములకు సరైన ధర రాదన్న ఆందోళన, మత్స్యకారుల్లో చేపల వేటకు అవకాశం ఉండదేమోనన్న భయాందోళన, కొన్ని కాలనీలు ఖాళీ చేయాల్సి ఉన్నందున వారికి ఎక్కడ పునరావాసం చూపిస్తారోనన్న సందేహం నెలకొన్నాయని తెలిపారు. వీటన్నిటికీ స్పష్టమైన హామీలు ఇవ్వడం, వారిలో నమ్మకం కల్పించి, వారి ఆమోదంతోనే భూసేకరణ ప్రక్రియను కొనసాగించనున్నట్లు చెప్పారు. రైతుల ఆందోళనలు, వారు వ్యక్తం చేసిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించామని, ఈ సమస్యపై ఉన్నతస్థాయిలోనూ చర్చ జరుగుతోందని వివరించారు. కరేడులో భూసేకరణను గ్రామం యావత్తూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ ఆందోళన బాటపట్టడం, భూములు ఇచ్చేదిలేదని గ్రామసభల్లోనూ ఏకగ్రీవ తీర్మానం చేసిన నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' అడిగిన పలు ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు ఆమె మాటల్లోనే...

కరేడులో భూసేకరణ ప్రక్రియపై తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది కదా!

ప్రస్తుతానికి భూసేకరణ ప్రక్రియ యథావిధిగా నడుస్తోంది. రైతులకు సంతృప్తికరమైన సమాధానాలు ఇచ్చి వారి సహకారంతోనే భూసేకరణ ప్రక్రియను కొనసాగిస్తాం.

భూములు ఇచ్చేదిలేదని గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు కదా!

ఈ సమస్యపై ఉన్నతస్థాయిలో కూడా చర్చ జరుగుతోంది.

రైతులంతా వ్యక్తిగతంగా మీకు అర్జీలు అందజేశారా?

573 మంది రైతులు అర్జీలు ఇచ్చారు. ప్రతిఒక్కరికీ వ్యక్తిగతంగా వారు తెలిపిన అభ్యంతరానికి భూసేకరణ అధికారి సమాధానం పంపిస్తాం.

భూముల ధర ఎలా నిర్ణయించారు?

మెట్ట, మాగాణి భూమికి రూ.15 లక్షలు, తోటలకు రూ.17 లక్షలు, జాతీయ రహదారి పక్కనుండే భూములకు రూ.60 లక్షలు పరిహారం అందే అవకాశం ఉంది. అయితే మూడేళ్లలో జరిగిన రిజిస్ట్రేషన్ల ఆధారంగా సేల్‌వాల్యూలను చూసి సరాసరి చేసి రైతుల అభీష్టంమేరకు కొంత నెగోషియేట్ చేసి ధర నిర్ణయించే అవకాశం ఉంటుంది.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే చెరువు శిథిలం

- బసాపురం చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే, అధికారులు



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసాథి, అధికారులు

ఆదోని టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే చెరువు శిథిలమవుతోందని ఎమ్మెల్యే పార్థసారథి విమర్శించారు. బుధవారం సీడీవో(సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, విజయవాడ) పబ్లిక్ హెల్త్ (అనంతపూర్) అధికారులతో కలిసి బసాపురం చెరువును పరిశీలించారు. గత ఎమ్మెల్యే అక్రమ సంపాదనపై చూపిన శ్రద్ధ అభివృద్ధిపై చూపలేదన్నారు. చెరువుకు శాశ్వత మరమ్మతులు చేయించేందుకు ఉన్నతాధికారులను పిలిపించామన్నారు. సీడీవో ఎస్ఈ శివకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో మరమ్మత్తులు చేసే అవకాశం లేదని, వచ్చే వేసవిలో తాత్కాలిక మరమ్మత్తులు చేస్తామన్నారు. చెరువు కట్టకు స్టోన్ రివిట్‌మెంట్ చేయాల్సి ఉందని, డీపీఆర్ సిద్ధం చేస్తామన్నారు. శాశ్వత మరమ్మతులకు ఎక్కువ సమయం పడుతుందని, అంతవరకు ఇసుక బస్తాలను వేసుకోవాలని సూచించారు. సీడీవో, ఈఈ కేదార్‌నాథ్ రెడ్డి, జెఈ విజయ రాజు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామ్ మోహన్ రెడ్డి, డిప్యూటీ ఎస్ఈ సతీష్, ఇంజనీర్ వెంకట చలపతి, డీఈరామమూర్తి, చైర్ పర్సన్ లోకేశ్వరి ఉన్నారు.

గడప గడపకు వెళ్లండి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

హొళగుంద, జూలై 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా గడగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజు సూచించారు. బుధవారం హొళగుందలో మాట్లాడుతూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేయాలన్నారు. పరిశీలకుడు పూల నాగరాజు, అనంతపురం టీడీపీ జిల్లా అధ్యక్షుడు శివనారాయణ యాదవ్, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ ఉన్నారు.

నేడు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

- పాఠశాలలు ముస్తాబు చేసిన విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు



ఆదోనిలో అలంకరణ సామగ్రి సిద్ధం చేస్తున్న విద్యార్థినులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నేడు మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిధులు మంజూరు చేసింది. దీంతో బుధవారం పాఠశాలలను ముస్తాబు చేశారు. ఉపాధ్యాయులు సర్వం సిద్ధం చేశారు. విద్యార్థులు ఆహ్వాన పత్రికలను తయారు చేసి, ముఖ్య అతిథులకు అందజేశాంనను. ఆదోని నెయోజకవర్గంలో 139 ప్రభుత్వ పాఠశాలల ఉన్నాయి. ఇందులో 40 వేల మందిపైగా విద్యార్థులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. ప్రభుత్వం బడి తెరిచిన రోజే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాకిట్లను అందించింది. మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యాన్ని పంపిణీ చేసింది.

పాఠశాలలు ముస్తాబు

పాఠశాలలను విద్యార్థులు రంగురంగుల పేపర్లతో అలంకరించారు. దీంతో తరగతి గదులు ఆహ్లాదకర వాతావరణంలో కనిపిస్తున్నారు. విద్యార్థులే స్వయంగా ఆహ్వాన పత్రికలు, బ్యాడ్జీలు తయారు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు కూడా అందించనున్నారు.



ఏర్పాట్లు పూర్తి చేశాము

మెగా పేరెంట్స్ టీచర్ సమావేశాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. బుధవారం పండుగలా నిర్వహించాలని పాఠశాలల్లో ఏర్పాటు పూర్తి చేశాము. విద్యార్థులు, తల్లిదండ్రులు, అతిథులతో పాఠశాలలు కళకళలాడుతాయి. సమావేశంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు మధ్య సంబంధాలు మెరుగుపడే అవకాశం ఉంది. **- భూపాల్ రెడ్డి, ఎంఈవో-1, ఆదోని.**

ఓటరు సర్వే పక్కాగా చేయాలి : ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ నాయక్

మద్దికెర, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో తప్పులు రాకుండా ఇంటింటికి వెళ్లి పక్కాగా సర్వే చేయాలని ఆర్డీవో భరత్ నాయక్ ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. బీఎల్‌వోలు ఓటరు జాబితాను తీసుకుని ఇంటింటికి వెళ్లి చనిపోయిన వారి పేర్లు గుర్తించాలన్నారు. మార్పులు, చేర్పుల వివరా లను సంబంధిత ఓటర్లను అడిగి తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా నిరంతర ప్రక్రియ అని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీఎల్‌వోలు ఓటర్లకు అందుబాటులో ఉండాలన్నారు. ఓటరు కార్డుతో ఆధార్‌తో లింకు చేయాలన్నారు. ఎన్నికల డీటీ లక్ష్మి, తహసీల్దార్ గుండాల్ నాయక్ ఉన్నారు.

సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం : ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

హాలహర్వి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబు సంక్షేమానికి పెద్దపీట వేశారని ఎంపీ బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. బుధవారం చత్రగుడి గ్రామం వద్ద సుపరిపాలన తొలి అడుగులో ఆయన పాల్గొన్నారు. సీఎం ఆదేశాల మేరకు ఇంటింటికి తిరిగి లబ్ధిదా రులందరికీ పథకాలు అందించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయి నాయ కులు ప్రభుత్వం చేసిన మంచిని, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు వెళ్లి వివరించాలని కోరారు. పరిశీలకుడు నాగరాజు, జిల్లా పరిశీలకుడు మీనాక్షి నాయుడు, ప్రహ్లాద్‌రెడ్డి, కన్వీనర్ సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణమనాయుడు, కామినహాల్ రమేష్, రఘుప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున, శ్రీదర్, మాజీ కన్వీనర్ బసప్ప పాల్గొన్నారు.

ఆదర్శ పంచాయతీలుగా మారుద్దాం

హాలహర్వి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివద్ధి చేసి ఆదర్శ పంచాయతీలుగా మారుద్దామని ఎంపీడీవో వరలక్ష్మి సూచించారు. బుధవారం కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. స్వచ్ఛభారత్, ఉపాధి హామీ, వ్యవసాయం, వెలుగు పథకాలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. డిప్యూటీ ఎంపీడీవో రామాంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరమణి, ఎంఈవో ఈరన్న, మండల జేఈ సోమన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించడమే ధ్యేయం



గోనబావిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఆదోని, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించ డమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప అన్నారు. బుధవారం గోనబావి గ్రామంలో సుపరిపాల నలో తొలి అడుగు నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఏడాది పాలనను ప్రజలకు వివరించారు. రంగస్వామి నాయుడు, రామస్వామి, భాస్కర్‌రెడ్డి, ఫక్రుద్దీన్, అల్తాఫ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, నాయకులు మంజూర్‌బాషా, డీలర్ శేషన్న, జయరాజ్ ఉన్నారు.

బంగారు రథంపై ప్రహ్లాదరాయలు



బంగారు రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు బంగారు రథంపై ఊరేగారు. బుధవారం అషాఢ చతుర్దశి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారు కవచంతో శోభాయమానంగా అలంకరించారు. పీఠాధిపతి పూర్ణ బోధ పూజ మందిరంలో మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య బంగారు రథంపై వజ్రాలు పొదిగిన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. ఉత్సవమూర్తికి ఊంజలసేవ నిర్వహించి హారతులిచ్చారు. భక్తులను పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వాదించారు.

కోర్టు భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన

ఎమ్మిగనూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరుకు సబ్‌కోర్టు, అడిషనల్ కోర్టు మంజూరైన విషయం తెలిసిందే. కోర్టుకు అవసరమైన భవనాలను నిర్మించేందుకు బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి స్థలాలను పరిశీలించారు. ఆదోని రోడ్డులోని డీఎస్పీ కార్యాలయం దగ్గర టీబీపీ శాఖకు చెందిన స్థలాన్ని, అలాగే పశుసంవర్ధక ఆసుపత్రి పక్కనున్న స్థలాన్ని ఎమ్మెల్యే అధికారులు, న్యాయవాదులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ అనుకూలంగా ఉండే స్థలాన్ని ఎంపిక చేసి కోర్టు భవనాల నిర్మాణాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రషీదుల్లా, న్యాయవాదులు లక్ష్మీనారాయణ రెడ్డి, మామిడి మల్లికార్జున. మల్లికార్జున, వెంకటేశ్వర రెడ్డి, వెంకటరెడ్డి, రామకృష్ణనాయుడు, నారాయణ, నర్సిరెడ్డి, గురుప్రసాద్, పార్లపల్లి మల్లికార్జున, నాగేష్, టీడీపీ నాయకులు మహేష్, బచ్చాల రంగన్న, నవాజ్, నరసింహులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా: ఎమ్మెల్యే

నందవరం, జూలై 9(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన భీమన్న, కనకవీడు గ్రామానికి చెందిన చిన్న నరసింహులు వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలకు గురై మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా బుధవారం అక్కడ వారి మృతదేహాలకు నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చి నేనున్నా అంటూ ధైర్యం చెప్పారు. దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట నాయకులు కాశీం వలి, దర్మాపురం గోపాల్, సత్యా రెడ్డి, జగ్గాపుం తిమ్మప్ప, నాగలదిన్నె కిషోర్, సుదీర్, జబ్బార్, వీరేష్, డబ్బా ఈరన్న ఉన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పెద్ద పార్కు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. సంఘం నాయకులు శ్రీనివాసులు, మారుతి మాట్లాడుతూ ఏబీవీపీ విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాలు పెంపొందిస్తుందన్నారు. వేణుగోపాల్, జావిద్, కార్తీక్‌లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

ఎమ్మిగనూరు టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఆంధ్రజ్యోతి డిప్యూటీ చీఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి అమానుషమని టీడీపీ నాయకుడు కదిరికోట అదెన్న అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా, బంగారుపాలెంలో మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనలో విధులు నిర్వహిస్తున్న ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని అభివర్ణించారు. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్ అయిన మీడియాపై దాడి చేయడం సరికాదన్నారు. ప్రజావ్యవస్థలపై దాడులకు పాల్పడితే వైసీపీకి మరోసారి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

దాడి హేయం

నందవరం: ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ గుండాలు, అల్లరిమూకలు దాడి చేయడం హేయమైన చర్య అని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు, పార్టీ మండల కన్వీనర్ కాశీంవలి అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా బంగారుపాలంలో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి న్యూస్‌ను కవర్ చేయడానికి వెళ్లిన శివకుమార్‌పై దాడికి పాల్పడం అమానుషమైన చర్యగా అభివర్ణించారు. టీడీపీ నాయకులు సత్యారెడ్డి, సుదీర్, కిషోర్, బోటు వీరేష్ ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం

ఎమ్మిగనూరుటౌన్/రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఎమ్మిగనూరులో కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మె విజయవంతమైంది. బుధవారం పట్టణంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్ టీయూ, ఆశా, అంగన్‌వాడీ, ఏఐకేఎస్, విద్యుత్, ఆటో కార్మిక తదితర కార్మిక సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రంగన్న యాదవ్, దాదావలి, జబ్బార్, నరసింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జునగౌడ్, నాగశిరోమణి, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, గ్రేషమ్మ, రంగలక్ష్మి, విశాలాక్షి, నాగలక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

కోసిగి: కోసిగిలో రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్ అధ్యక్షతన సమ్మె చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు కార్మిక సంఘాల నాయకులు మానవహారంగా చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, ఏఐటీయూసీ మండల నాయకులు గోపాల్, బీహెచ్‌పీఎస్ నాయకులు ఓంకార్ స్వామి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు హెబ్సిబారాణి, లూసమ్మ, వరలక్ష్మి, సుజాత, ఆశా వర్కర్స్ నాయకులు వెంకటమ్మ, సుజాత, తదితరులు ఉన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో ఏఐటీయూసీ నాయకులు భాస్కర్ యాదవ్, సీఐటీయూ మండల కార్యదర్శి భీమేశ్వరి, సీపీఎం మండల కార్యదర్శి జయరాజు ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు కార్మికులు ర్యాలీ చేశారు. రాఘవేంద్ర సర్కిల్, తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రాణేష్, లక్ష్మన్న, వీరేష్, విశాలాక్షి, మాధురి, తులశమ్మ, నరసమ్మ, శాంతి, భాగ్యలక్ష్మి, నాగమ్మ, రంగమ్మ, సుజాత, ప్రమీల, శ్వేత, స్వప్న, ఏరిషా, దేవపుత్ర, రాజు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్లలో పలు ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు ఎమ్మిగనూరు, కర్నూలు ప్రదానరహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని, అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆనందబాబు, సీఐటీయూ మండల నాయకులు నబిరసూల్, కేవీపీఎస్ నాయకులు కరుణకర్, అంగన్‌వాడీ సంఘం నాయకురాలు నీరజ, ఈరన్నగౌడ్, మునెప్ప, పుష్ప, వరలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, సుశాంతి, సుజాత నాయకులు పాల్గొన్నారు.

నందవరం: నందవరం బస్టాండ్‌లో సిఐటీయూ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. అనంతరం నినాదాలు చేస్తూ తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు గురుశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్, అంగన్‌వాడీ, ఆశవర్కర్ల యూనియన్ నాయకులు శారద, అరుణ, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: పెద్దకడబూరులోని ఏఐటీయూసీ, ఐఎఫ్‌టియూ, సీపీఎం, సీపీఐ, ఆశా, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆధ్వర్యంలో సమ్మెను చేపట్టారు. ఆయా కార్యాలయాల ముందు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా కార్మిక సంఘాల నాయకులు నాగరాజు, జాఫర్‌పటేల్, రాజు, దేవదాసు, ఈరన్న, నరసింహులు ఆశా వర్కర్లు చిట్టెమ్మ, లలిత పాల్గొన్నారు.





గోనెగండ్లలో రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, నందవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



ఎమ్మిగనూరు: సమ్మెలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు



కోసిగి: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో మానవహారంగా నిలబడిన కార్మిక సంఘాల నాయకులు



మంత్రాలయం: ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆర్డీఎస్‌కు జలకళ



ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

కోసిగి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఆర్డీఎస్ ఆనకట్టకు జలకళ సంతరించుకుంది. కర్ణాటకలోని తుంగభద్ర డ్యాం నుంచి 20 గేట్లు ఎత్తి సుమారు 50వేలకు పైగా క్యూసెక్కులు నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఆర్డీఎస్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో బుధవారం జలకళ సంతరించుకుంది. నదితీర గ్రామాల రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నీరు పోటెత్తడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీసు అధికారులు నదితీర గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

'కళాశాలను సీజ్ చేయాలి'

గోనెగండ్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ నియమ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న విజ్ఞాన్ డిగ్రీ కళాశాలను ఉన్నత విద్యామండలి అధికారులు విచారణ జరిపి సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షుడు మునిస్వామి డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ విజ్ఞాన్ కళాశాల యజమాన్యం యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కి యూనివర్సిటీకి తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి యూనివర్సిటీని మోసగించిందని ఆరోపించారు. నాయకులు ప్రభాకర్, జలీల్, రహంతుల్లా పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రమాణస్వీకారంలో కౌన్సిలర్

ఎమ్మిగనూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): విజయవాడలో బుధవారం జరిగిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వీజీఏ దయాసాగర్ పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారంలో పాల్గొని రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే లక్ష్యం

మంత్రాలయం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అందరికీ ఆరోగ్యమే టీడీపీ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎన్ రఘునాథ్ రెడ్డి అన్నారు. సీఎం సహాయనిధి నుంచికౌతాళం మండలంలోని కాత్రికి గ్రామానికి చెందిన చాకలి శరణప్పకు మంజూరైన చెక్కును బుధవారం రాత్రి ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్ రెడ్డి, గూర్కింటి భీమిరెడ్డి, నాగరాజు, రామయ్య, రామకృష్ణ భూదిరెడ్డి పాల్గొన్నారు.

మైక్‌సెట్ విరాళం

కౌతాళం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బా విద్యాలయానికి దాత మహాదేవస్వామి మైక్‌సెట్‌ను విరాళంగా ఇచ్చారు. బుధవారం మైక్‌సెట్‌ను ఎస్‌వో పుష్పలతకు అందజేశారు. దాతను ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని మిలటరీ కాలనీలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమపథకాలు, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తుంటే వైసీపీకి నిద్రరావటం లేదని, ఏదోరకంగా బురదచల్లే కార్యక్రమాలను చేపట్టిందని ఎమ్మెల్యే విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, కమిషనర్ గంగిరెడ్డి, టీడీపీ నాయకులు ప్రతాపరెడ్డి, ఉరుకుంద, కృష్ణ, రంగన్న, దామ నరసింహులు, గాజుల సుధాకర్, గోవిందు, పాండు, షాలేమ్, గిరి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి ఫలాలు: రాఘవేంద్రరెడ్డి

పెద్దకడుబూరు: ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి ఫలాలు చేరాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గంగులపాడు, రాగిమాన్ దోడ్డి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీఎం సహాయనిధి నుంచి బాధితులకు మంజూరు అయిన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, నాయకులు బసలదొడ్డి ఈరన్న, బాబురావు, ఆంజినేయులు, నరసప్ప, ఏసేపు, మురళి కృష్ణ, నాగేంద్ర, నరసింహరెడ్డి, ప్రతాప్ రెడ్డి, హనుమంతు రెడ్డి, విజయ్, అయ్యప్ప, బొగ్గుల నరసన్న, కంబగిరి, ముక్కన్న పాల్గొన్నారు.

కోసిగి: కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి పథకాలు అందిస్తున్నామని టీడీపీ నాయకులు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం కోసిగి మండల కేంద్రంలోని సిద్దప్ప పాలెం 103 బూత్ నెంబర్ పరిధిలో టీడీపీ నాయకులు చింతలగేని నర్సారెడ్డి, వీరేష్, సంజీవగేని ఈరన్న ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. కార్యక్రమంలో నాయకులు కిందిగేరి ఉదుమయ్య, కొరివి హనుమప్ప, తిమ్మయ్య, మోడల్ స్కూల్ విద్యా కమిటి చైర్మన్ నారాయణ, వీరస్వామి, చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.



మహిళకు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



గంగులపాడులో కరపత్రాన్ని అందిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

నందవరం: మండలంలోని ముగతి, జగ్గాపురం, సోమలగూడురు, పెద్దకొత్తిలి, హలహర్వి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల నాయకులు ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముగతి ఈరన్నగౌడు, భార్గవ్‌యాదవ్, కడుబూరి, కొండారెడ్డి, ఆదిశేషు, దావీదు, నాగరాజు, జగ్గాపురం రంగన్న, తిమ్మప్ప, గోపాలు, దస్తగిరి పాల్గొన్నారు.

ఘనంగా మౌలాలి పీర్ల ఊరేగింపు

150 కేజీల గుండు ఎత్తిన యువకుడు



పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు/టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెద్ద కటికే వీధిలో వెలసిన మౌలాలి పీర్ల ఊరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పీర్ల చావిడి దగ్గర పీర్లను భక్తులు దర్శించుకొని చెక్కెర చదివింపులు చేసి ఫతేహాలు నిర్వహించారు. పీర్ల చావిడినుంచి పట్టణంలోని గోనేగండ్లరోడ్డు, షరాఫ్ బజార్‌ల మీదుగా పీర్లను మేళతాళాల మధ్య ఊరేగింపు చేశారు. అనంతరం పీర్ల చావిడి దగ్గర స్థానిక యువకులు నిర్వహించిన కర్రసాము, అగ్నిగోళాన్ని తిప్పటం, కాడిమాను విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అలాగే రహ్మతుల్లా అనే యువకుడు 150 కేజీల రాతిగుండును ఎత్తి శభాష్ అనిపించుకున్నాడు. కార్యక్రమంలో పెద్దలు బందేనవాజ్, రసూల్, అమీర్, షరీఫ్, జాకీర్, హనీఫ్, ఖాజా, సాబీర్, ముల్లా సలీం, రహంతుల్లా పాల్గొన్నారు.



150 కేజీల రాతిగుండును ఎత్తిన యువకుడు రహ్మతుల్లా

సబ్సిడీ పండ్ల మొక్కలను సద్వినియోగం చేసుకోవాలి

కోసిగి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో భాగంగా వందశాతం సబ్సిడీతో ఇస్తున్న పండ్ల మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని దుద్ది గ్రామంలో ఏపీవో ఖాలిక్, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు ఆధ్వర్యంలో పొలాల్లో నల్లరేగడి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ముత్తురెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో అంతర్‌పంటలుగా పండ్ల మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ వందశాతం సబ్సిడీని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్లబండ సహకార సంఘం చైర్మన్ నాడిగేని అయ్యన్న, టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, మాజీ జడ్పీటీసీ రామకృష్ణ, నాడిగేని చిన్నతాయన్న, వెంకటేష్, రామిరెడ్డి, తిక్కయ్య గవిగట్టు ఈరయ్య, ఐరంగల్ శివ, బసవరాజు రైతులు ఉన్నారు.

యూరియా అక్రమ నిల్వలపై విచారణ

గోనెగండ్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామంలోని ఓ ఎరువుల దుకాణంలో యూరియా అక్రమంగా నిల్వ చేసినట్లు ఫిర్యాదు అందడంతో బుధవారం విచారణ జరిపినట్లు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత తెలిపారు. గ్రామానికి ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాలకు ఎంత స్టాక్ వచ్చింది? ఎంత అమ్మకాలు జరిపారు? మిగిలిన స్టాక్ ఎంత అని స్టాక్ బుక్‌లను తనిఖీ చేశారు. అలాగే ఎంతమంది రైతులు ఎన్ని బస్తాల యూరియాను కొనుగోలు చేశారని రైతులను విచారించారు. అనంతరం ప్రైవేట్ దుకాణదారుని దగ్గరకు వెళ్లి వారి గోడౌన్‌లో ఎంత మేర యూరియా స్టాక్ ఉంది? అది ఎక్కడ నుంచి స్టాక్ వచ్చింది? అని విచారణ చేశారు. గోడౌన్ నిల్వ ఉన్నస్టాక్ సక్రమమైందా..? అని రికార్డులను పరిశీలించారు.

ఆర్ఎంపీల సమస్యలను పరిష్కరించాలి

గోనెగండ్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న ఆర్ఎంపీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆర్ఎంపీల సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు గోవిందరెడ్డి అన్నారు. గోనెగండ్లలో ఆర్ఎంపీల సమావేశం నిర్వహించారు. ఆయన ఆర్ఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.ఈనెల 16న కర్నూలులో ఆర్ఎంపీల మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

పంచాయతీ పురోగతిపై శిక్షణ

కోసిగి, జూలై 9(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మెడికల్ డిపార్టుమెంట్ల వారికి పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం నుంచి వచ్చిన సమాచారం మేరకు ఉద్యోగులకు శిక్షణ ఇచ్చామన్నారు. తహసీల్దార్ వేణుగోపాల్, పీఆర్‌ఏఈ మాలిక్, ఏపీవో కాలిక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు పాల్గొన్నారు.

గురు పౌర్ణమి వేడుకలు విజయవంతం చేయాలి

కోసిగి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని ఉరుకుంద రోడ్డులో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయంలో జరిగే గురు పౌర్ణమి వేడుకలను విజయవంతం చేయాలని సాయి సేవకులు సాయి రుత్విక్, గట్టు రమేష్, మునీంద్ర కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈ నెల 10న సాయంత్రం 6 గంటల నుంచి 11న ఉదయం 6 గంటలకు 12 గంటల పాటు ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి నామ అఖండ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ

ఎమ్మిగనూరు రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణం, మండలంలోని బీఎల్‌వోలకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదుకు సంబంధించిన విధానాలతోపాటు బూత్ స్థాయి పనితీరులో అవలంబించాల్సిన నిబంధనలపై సమగ్రంగా వివరించారు.

వైసీపీ ప్రభుత్వం వస్తే.. కార్యకర్తలకు సముచిత స్థానం

● ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి
● మంత్రాలయంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

మంత్రాలయం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో వైసీపీ అఖండ విజయం సాధిస్తుందని, ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎమ్మెల్యే సొంత గ్రామమైన రాంపురంలో రామలింగేశ్వరస్వామి ఆలయ మైదానంలో వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి శశికళ హాజరయ్యారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులు పెట్టే కేసులకు భయపడొద్దన్నారు. ఐదవ సారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా తిరిగి మీముందుకు వస్తానని దీమా వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలో ఐదు పదవులు ఇచ్చిన తమ అధినేత జగన్‌కు రుణపడి ఉంటామని తెలిపారు.

● బెదిరింపులకు భయపడం: ఎస్వీ మోహన్ రెడ్డి

టీడీపీ బెదిరింపులకు భయపడేది లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో కేసులు పెడితే భయపడొద్దని, రాంపురం రెడ్డి సోదరులు అండగా ఉంటారని, ఇందు కోసం జిల్లా కోర్టులో పది మంది లాయర్లను, హైకోర్టులో పైసా ఖర్చు లేకుండా బెయిల్ మంజూరు చేసేందుకు అన్ని సిద్ధం చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీదే విజయమని తెలిపారు. పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా ఫెయిల్ అయ్యారని, పవన్ సినిమాల్లో హీరో.. రాజకీయాల్లో జోకర్‌గా మారారన్నారు. సమావేశంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, మురళీరెడ్డి, పురుషోత్తంరెడ్డి, గురెడ్డి భీమిరెడ్డి, సీవీ విశ్వనాథరెడ్డి, ప్రహ్లాదాచార్, రామాంజనేయులు, రామ్మోహన్‌రెడ్డి, తెల్లబండ్ల భీమయ్య, రాఘవేంద్ర, మంత్రాలయం నియోజకవర్గం కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి